
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5 మంగళవారం 30 ఏప్రిల్ 2024





● పిల్లర్ల దశ దాటని బాపట్ల మెడికల్ కళాశాల పనులు

రేపు చీరాలకు చంద్రబాబు



● ఊరటనిచ్చే హామీలపై చేనేతల్లో ఆశ

చీరాల, ఏప్రిల్ 29: చీరాల ప్రజలు టీడీపీ అధినేత చంద్రబాబు రాక కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో రెండు మూడు పర్యాయాలు చంద్రబాబు పర్యటన ఉంటుందని భావించారు. అయితే ఆ పర్యటనలు వాయిదా పడ్డాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి అభ్యర్థుల తరఫున చంద్రబాబు ప్రజాగళం పేరుతో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం చంద్రబాబు చీరాల పర్యటన ఖరారైంది. దీంతో నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్యకు చంద్రబాబు పర్యటన అదనపు బలం అవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రధానంగా నేతన్నలు తమకు ఊరటనిచ్చే హామీలు చంద్రబాబు ప్రత్యేకంగా ప్రకటించవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వేటపాలెం మండలం నాయినిపల్లి పంచాయతీ పరిధిలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన చర్యలు, ఆ తర్వాత కోర్టు పరిధిలోకి వెళ్లిన అంశాలపై నేతన్నల్లో చర్చ సాగుతోంది. అలాగే గతంలో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రాంగణంలో చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రబాబు చీరాల ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన కుప్పడం చీరకు భౌగోళిక గుర్తింపు తెస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఈ రెంటింటికీ కార్యరూపం జరుగుతుందని నేతన్నలు భావిస్తున్నారు. ఆ రెండు అంశాలపై ప్రజాగళం సభలో చంద్రబాబు మరోసారి ప్రస్తావిస్తారని నేతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొమ్మమూరు కాలువ ఆధునికీకరణపై కూడా ప్రస్తావించే అవకాశం ఉందంటున్నారు. ఇక కుందేరు, రొంపేరు ప్రక్షాళనకు చేపట్టే చర్యలపై కూడా ప్రకటన చేస్తే బాగుంటుందని శ్రేణులతో పాటు ప్రజలు భావిస్తున్నారు. అత్యధిక తీరప్రాంతం ఉన్న చీరాల మండలం వాడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం, అందుకు సంబంధించిన అనుబంధ పరిశ్రమలపై హామీలు ఇస్తారని ఎదురుచూస్తున్నారు.



మగ్గంపై నేత నేస్తున్న చేనేత మహిళ

పర్యాటకంగా అభివృద్ధిలో భాగంగా ఒనగూరే ఉపాధి అవకాశాలు తదితర అంశాలను కూడా ప్రస్తావించి, స్పష్టమైన ప్రకటన చేస్తే బాగుంటుందని మత్స్యకార గ్రామాల ప్రజలతో పాటు, నియోజవకర్గ ప్రజలు సూచిస్తున్నారు. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల్లో ఒకటైన చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ పరిధిలోని ఆటోనగర్ కార్యరూపం దాల్చేందుకు ఎదురవుతున్న బాలారిష్టాలను అధిగమించేందుకు, తదుపరి చర్యలకు సంబంధించి కూడా స్పష్టత ఇస్తారని భావిస్తున్నారు.

ఎన్నికల బరిలో.. 104 మంది

బాపట్ల లోక్‌సభ స్థానంలో 15 మంది పోటీ ● రేపల్లె మినహా మిగిలిన స్థానాల్లో 15 మంది

బాపట్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల తుది ఘట్టం ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం సాయంత్రంతో ముగియడంతో పోటీలో ఉండే అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. జిల్లా పరిధిలోని బాపట్ల లోక్‌సభ, ఆరు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి గడువులోపు 19 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో మొత్తం 104 మంది బరిలో నిలిచారు. బాపట్ల లోక్‌సభ స్థానం నుంచి 15 మంది తుది పోటీలో నిలిచారు. గడువు ముగిసే సరికి బాపట్ల లోక్‌సభ స్థానం నుంచి ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. వేమూరు, బాపట్ల, పర్చూరు, అద్దంకి, చీరాల అసెంబ్లీ స్థానాల్లో ఒక్కో స్థానం నుంచి 15 మంది బరిలో ఉన్నారు. రేపల్లెలో 14 మంది తుది పోటీలో నిలిచారు. ఈ నెల 18న నామినేషన్ల ఘట్టం మొదలైనప్పుడు మొత్తం 151 మంది నామినేషన్లు వేయగా, పరిశీలనలో 28 మంది నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సోమవారం 19 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా 104 మంది తుది పోటీలో మిగిలారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. బ్యాలెట్‌లో అభ్యర్థుల పేర్లు క్రమసంఖ్యను కూడా వెల్లడించారు.

తుది బరిలో ఉండే అభ్యర్థుల సంఖ్య

స్థానం	నామినేషన్లు	తిరస్కరణ	విత్‌డ్రా	బరిలో
● బాపట్ల(లోక్‌సభ)	20	3	2	15
● వేమూరు(అసెంబ్లీ)	18	2	1	15
● రేపల్లె	18	3	1	14
● బాపట్ల	31	5	11	15
● పర్చూరు	20	3	2	15
● అద్దంకి	21	6	0	15
● చీరాల	23	6	2	15
మొత్తం	151	28	19	104

● మూడేళ్లుగా పూర్తి కాని పనులు
● బాపట్లలో పిల్లర్ల దశ దాటని నిర్మాణాలు
● పిడుగురాళ్లలో హడావుడిగా ప్రారంభోత్సవం
● 2025-26 తరగతులు ప్రారంభం గగనమే

కాలేజీ పనులు

మాటల్లోనే వైద్య కళాశాలలు

ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ వైద్య కళాశాల. ఇంత వరకూ ఏ ప్రభుత్వం చేయని సాహసం. రూ.500 కోట్లతో వైద్య కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. మూడేళ్లలో పనులు పూర్తి చేస్తాం. తరగతులను ప్రారంభిస్తాం. కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటు లోకి తెస్తాం.. అని సీఎం జగన్ ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఇప్పటికీ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాపట్ల, పిడుగురాళ్లలో వైద్య కళాశాల భవన నిర్మాణాలు ఒక కొలిక్కి రాలేదు. ముఖ్య మంత్రి ప్రకటించిన వైద్య కళాశాలలు మాటలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వం చెప్పే మాటలు కార్యరూపం దాల్చడం అసాధ్యంగానే కనబడు తోంది. మరోవైపు జాతీయ వైద్య కమిషన్ నిబంధనలు మెడికల్ కళా శాలకు గొడ్డలిపెట్టుగా మారనున్నాయి. కనీస స్థాయిలో కూడా కసరత్తు లేని ప్రభుత్వ విధానాలు మెడికల్ కళాశాలకు భవిష్యత్తులో శాపాలుగా పరిణమించనున్నాయన్న విమర్శలున్నాయి. అయినా ఎన్నికల సభల్లో, ప్రచారాల్లో సీఎం జగన్‌తో పాటు వైసీపీ నేతలు కూడా వైద్య కళాశాలలపై ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నారు.

బాపట్ల, పిడుగురాళ్ల/ ఏప్రిల్ 29 (ఆంధ్ర జ్యోతి): బాపట్ల, పిడుగురాళ్లలో వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, టీచింగ్ హాస్పిటల్‌కు సీఎం జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ముఖ్యమంత్రి జగన్ 2021 మే 31న ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. 2023 డిసెంబరు నాటికి నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని నాడు జగన్ ప్రకటించారు. అయితే 2024 ఏప్రిల్ వచ్చినా వైద్య కళాశాల నిర్మాణాలు ఒక కొలిక్కిరాలేదు. బాపట్లలో అయితే మూడేళ్లు గడిచినా భవన నిర్మాణాలు పిల్లర్ల దశ దాటలేదు. శంకుస్థాపన అనంతరం రెండేళ్ల పాటు పనుల ఊసే పట్టించుకోలేదు. ఎన్నికల వస్తున్నాయని ఏడాది క్రితం నామమాత్రంగా పనులు ప్రారంభించారు. పిల్లర్ల దశలోనే బాపట్ల వైద్య కళాశాల నిర్మాణం ఉంది. పిడుగురాళ్లలో మెడికల్ కాలేజీ పనులు మూడు నెలలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఎన్నికల సమీపిస్తున్నాయని ఇటీవల ప్రజలను మభ్య పెట్టేందుకు హడావుడిగా ఓ బ్లాక్‌కు రంగులు వేసి హడావుడిగా ప్రారంభోత్సవం చేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడం కూడా కళాశాల పనులు సక్రమంగా జరగడంలేదని సమాచారం. అయినా అరకొర పనులతోనే తాము వైద్య కళాశాలలను అందుబాటులోకి తెచ్చినట్లు అదే తమ ఘనతగా చెప్పుకోవడం సీఎం జగన్‌కే చెల్లిందని ప్రతిపక్షాలతో పాటు బాపట్ల, పల్నాడు జిల్లా వాసులు విమర్శిస్తున్నారు. నిర్మాణ పనులు నత్తను తలపించే విధంగా సాగుతుంటే 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభిస్తామని ప్రచారం చేసుకోవడం అంటే ప్రజలను వంచించడమేనని ప్రతిపక్ష నేతలు అంటున్నారు.

బాపట్ల.. బాలారిష్టాలు

బాపట్ల శివారు జమ్ములపాలెం రోడ్డులోని 50 ఎకరాల స్థలంలో వైద్య కళాశాలకు శంకుస్థాపన జరిగింది. వైద్య కళాశాల కోసం ఓ దాత 50 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారని అప్పట్లో చెప్పారు. అందులోనే కళాశాలకు శంకుస్థాపన జరిగింది. అయితే ఆ భూమి విషయంలో అనేక ఆరోపణలు వచ్చాయి. అదంతా అసైన్డ్ భూమి అని దానిని విరాళంగా ఇవ్వడం ఏమిటనే ప్రశ్న కూడా ఉత్పన్నమైంది. అయినా దానిపై అధికారులు నోరుమెదపలేదు. ఆ తర్వాత నిధుల విషయంలో తాత్సారం జరిగింది. దీంతో మెడికల్ కళాశాల పనులు ప్రారంభం కాలేదు. సీఎం శంకుస్థాపన చేసిన తర్వాత రెండేళ్ల పాటు పనుల ఊసే మరిచారు. ఏడాది క్రిత మే పనులను మొదలుపెట్టారు. ఇలా ఎన్నో బాలారిష్టాలు మెడికల్ కళాశాల పనులను వెంటాడుతున్నప్పటికీ ప్రభుత్వం మోసపు మాటలతో కాలం వెళ్లబుచ్చుతూ అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని ప్రజలు విమర్శి స్తున్నారు.

జిల్లా కేంద్రమైనా వైద్యం అంతంతే..

బాపట్ల జిల్లా కేంద్రంగా మారింది. అయినా ఆ స్థాయిలో వైద్య సేవలు అభివృద్ధి చెందలేదు. బాపట్ల ఏరియా ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి తగ్గట్లు వైద్య సేవలను మెరుగుపరిచే విషయంలో ప్రభుత్వం విఫలమైంది. అత్యవసరమైతే అటు ఒంగోలో, ఇటు గుంటూరు వెళ్లాల్సిన దుస్థితిని ప్రజానీకం ఎదుర్కొంటోంది. చాలా సందర్భాల్లో బాపట్ల ఏరియా ఆస్పత్రికి వెళ్లిన కేసుల విషయంలో సరైన సౌకర్యాలు లేవనో, నిపుణులైన డాక్టర్లు లేరనో గుంటూరు ఆస్పత్రికి రిఫర్ చేసిన సందర్భాలు కోకొల్లలు. ఈలోగా వారు ప్రాణాలు విడిచిన సందర్భాలు అనేకం.

పిడుగురాళ్లలో హడావుడి ప్రారంభోత్సవం

పనులు పూర్తి కాలేదు కానీ పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి సమీపంలో ప్రభుత్వ వైద్య కళాశాలను వైసీపీ పాలకులు ప్రారంభించేశారు. నలభై ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్లతో కళాశాల, ఆస్పత్రిలను ఆరు బ్లాక్‌లలో నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రకారం మెడికల్ కళాశాల, దానికి అనుబంధంగా ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల కు మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. నిధులు కొరతతో మూడు నెలలు ఆలస్యంగా పనులు ప్రారంభమయ్యాయి. ఇంకా పలు భవనాల నిర్మాణాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. భవనాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలంటే మరో రెండేళ్ల సమయం పట్టేట్లు ఉంది. ఎన్నికల సమీపి స్తుండటంతో ఫిబ్రవరిలో హడావుడిగా ఓ బ్లాక్‌కు రంగులు వేసి నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలు ప్రారంభోత్సవం చేసేశారు. ప్రారంభించిన భవనాల లోపల గదుల్లో ఎటువంటి సౌకర్యాలు నేటికి ఏర్పాటు చేయలేదు. మరో రెండు నెలల్లో ఆస్పత్రిని అందు బాటులోకి తీసుకొస్తామని ఫిబ్రవరిలో చెప్పినా ఇంతవరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా పనులు సాగుతున్నాయి. మెడికల్ కళాశాలపై చెప్తున్న అబద్ధపు మాటలను ఇకనైనా అధికార పార్టీ నేతలు మానుకోవాలని పల్నాడు ప్రజలు పేర్కొంటున్నారు.

నిధులు కేంద్రానివి.. ఆర్భాటం వైసీపీది

లోక్‌సభ నియోజకవర్గాల ప్రకారం జిల్లాల విభజన జరిగింది. నూతన జిల్లాల ప్రాతిపదికగా ప్రతీ జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి జగన్ ప్రకటించి ఆ ప్రకారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ రంగంలో ఇన్ని మెడికల్ కళాశాల నిర్మాణం అద్భుతమని ఆయనకి ఆయనే ప్రకటించుకుంటున్నారు. అయితే వైద్య కళాశాలకు కేంద్రం సగం నిధులు ఇస్తున్న సంగతిని మాత్రం వైసీపీ పాలకులు చెప్పడం లేదు. రూ.500 కోట్లతో ఏర్పాటు చేస్తున్న వైద్య కళాశాల, అనుబంధ ఆస్పత్రిలకు రూ.250 కోట్లను కేంద్రం మంజూరు చేస్తుంది. అయితే ఆ నిధులను సక్రమంగా వినియోగించకపోవడం వల్లే బాపట్ల, పిడుగురాళ్ల కళాశాలల పనులు ఒక కొలిక్కి రాలేదని సమాచారం. బిల్లులు మంజూరులో జాప్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. బాపట్లలో అయితే పిల్లర్ల దశ కూడా దాటకపోగా, పిడుగురాళ్లలో కేవలం ఇప్పటికి రూ.180 కోట్ల పనులే జరిగాయి. అంటే కేంద్రం విడుదల చేసిన పూర్తి నిధులను కూడా వ్యయం చేయకుండా వైసీపీ ప్రభుత్వం మాయ చేసిందన్న ఆరోపణలు వస్తున్నాయి. మొత్తంమీద నిధులు కేంద్రానికి కాగా ఆర్భాటం వైసీపీది అన్నట్లుగా వైద్య కళాశాలల పరిస్థితి మారిందని బీజేపీ నాయకులు విమర్శిస్తున్నారు.



హడావుడిగా ప్రారంభోత్సవానికి ఓ బ్లాక్‌కు రంగులు వేసిన బ్రాహ్మణపల్లిలోని మెడికల్ కళాశాల భవనం



● పిడుగురాళ్ల : బ్రాహ్మణపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న భవన సముదాయాలు.

జిల్లా ఓటర్లు.. 12,91,716

● అద్దంకిలో అత్యధికం.. బాపట్లలో అత్యల్పం
● తాజా జాబితాలో 16,176 మంది పెరుగుదల

బాపట్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కోసం వినియోగించే తుది ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారులు సోమవారం విడుదల చేశారు. జనవరి 22న ఓటర్ల తుది జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కొత్తగా ఓటర్ల నమోదుతో పాటు చేర్పులు, మార్పులకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు వచ్చిన చేర్పులతో అనుబంధ ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేశారు. ఈ ప్రకారం జిల్లా ఓటర్ల సంఖ్య 12,91,716గా ఉంది. జనవరి 22న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం ఓటర్ల సంఖ్య 12,75,540. సోమవారం విడుదల చేసిన తుది ప్రచురణలో పురుష ఓటర్ల సంఖ్య 6,29,794, మహిళా ఓటర్ల సంఖ్య 6,61,841గా ఉంది. తాజా జాబితాలోనూ అతివలే అగ్రస్థానంలో ఉన్నారు. ఈ మూడు నెలల వ్యవధిలో ఓటర్ల సంఖ్యలో 16,176 మంది పెరుగుదల నమోదైంది. సోమవారం విడుదల చేసిన ఓటర్ల జాబితాతోనే ఎన్నికలు జరగనుండడంతో రాజకీయపార్టీలన్నీ దీనిపై దృష్టిసారించాయి. బాపట్ల లోక్‌సభ పరిధిలోని సంతనూతలపాడు ఓటర్ల సంఖ్య 2,14,638గా ఉంది. దీనిని కూడా కలుపుకుంటే బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఓటర్ల సంఖ్య 15,06,354గా ఉంది.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
● వేమూరు	95,587	101855	16	1,97,458
● రేపల్లె	1,11,240	1,15,979	13	2,27,232
● బాపట్ల	92,803	98,112	10	1,90,925
● పర్చూరు	1,11,865	1,17,462	6	2,29,333
● అద్దంకి	1,19,570	1,24,475	12	2,44,057
● చీరాల	98,729	1,03,958	24	2,02,711
మొత్తం	6,29,794	6,61,841	81	12,91,716

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.1

పాఠకుని పూర్తి పేరు : ....
డోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

గుంటూరు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. గుంటూరు ఈస్ట్				
2. గుంటూరు వెస్ట్				
3. తాడికొండ				
4. ప్రత్తిపాడు				
5. మంగళగిరి				
6. తెనాలి				
7. పొన్నూరు				
8. బాపట్ల				
9. రేపల్లె				
10. వేమూరు				
11. మాచర్ల				
12. గురజాల				
13. వినుకొండ				
14. చిలకలూరిపేట				
15. నరసరావుపేట				
16. పెదకూరపాడు				
17. సత్తెనపల్లి				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : శివశంకరీ దేవాలయం దగ్గర, వెంగళాయపాలెం, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు జిల్లా


బొర్రా వెంకట అప్పారావుతో కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాసరావు

'యరపతినేని' దౌత్యం.. మెత్తబడిన 'బొర్రా'

- ఇండిపెండెంట్ నామినేషన్ విత్ డ్రా
- అప్పారావుతో ఫోన్ లో మాట్లాడిన చంద్రబాబు
- 'కన్నా' గెలుపుకు మార్గం సుగమం

సత్తెనపల్లి, ఏప్రిల్29: ఎన్నికల వేళ సత్తెనపల్లి నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇన్నిరోజుల అసంతృప్తిగా ఉన్న జనసేన మాజీ నేత బొర్రా వెంకట అప్పారావు ఎట్టకేలకు చల్లబడ్డారు. గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దౌత్యంతో బొర్రా వెంకట అప్పారావు సోమవారం నామినేషన్ విత్ డ్రా చేసుకున్నారు.

జనసేన పార్టీలో బొర్రా క్రియాశీలకంగా పనిచేశారు. సత్తెనపల్లి నియోజక వర్గ ఎమ్మెల్యే సీటు జనసేనకు కేటాయిస్తారని అప్పట్లో భావించారు. టీడీపీ మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణను నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంతో జనసేనకు చెందిన కొందరు నేతలు అసంతృప్తికి లోనయ్యారు. అందులో భాగంగా బొర్రా వెంకట అప్పారావు జనసేనకు రాజీనామా చేసి, ఇండిపెండెంట్‌గా ఎన్నికల బరిలో నిలిచారు. విషయం పార్టీ అధినేత వద్దకు చేరటంతో సత్తెనపల్లి ట్రబుల్‌షూటర్‌గా పేరొందిన యరపతినేనిని రంగంలోకి దించారు. చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రంగప్రవేశంచేసి బొర్రాతో సంప్రదిపులు జరిపారు. కన్నా, యరపతినేనిలు బొర్రాతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు కూడా బొర్రాతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. నేతల సంప్రదింపులతో మెట్టబడిన బొర్రా వెంకట అప్పారావు తన నామినేషన్ విత్ డ్రా చేసుకున్నారు. కన్నా లక్ష్మీనారాయణ గెలుపు కోసం తాను పనిచేస్తానని ప్రకటించారు. బొర్రాకు నియోజకవర్గ స్థాయిలో మంచి గుర్తింపు ఉండటంతో కన్నా గెలుపునకు మార్గం సుగమం అయ్యిందని పలువురు అంటున్నారు.


ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరిన మంగిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

అమరావతిలో వైసీపీకి భారీ షాక్

- వైస్ ఎంపీపీ మంగిశెట్టి, మరో 40 కుటుంబాలు టీడీపీలో చేరిక

అమరావతి, ఏప్రిల్ 29: మండల కేంద్రమైన అమరావతిలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. మండల వైసీపీ మాజీ కన్వీనర్, వైస్ ఎంపీపీ మంగిశెట్టి శ్రీనివాసరావు సోమవారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. భాష్యం ప్రవీణ్ స్థానిక గంటలమ్మ చెట్టు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసరావుకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీనివాసరావుతో పాటు వైసీపీ నాయకులు నిమ్మా వెంకటేశ్వరరావు, జెట్టి అమరేంద్ర, రాయల అప్పారావు, మంగిశెట్టి బుజ్జి, ఉమామహేశ్వరరావులతో పాటు సుమారు 40కుటుంబాలు టీడీపీలో చేరడం జరిగింది. వీరి చేరికతో అమరావతిలో కాపు సామాజిక వర్గానికి చెందిన వారు నాలుగు దఫాలుగా టీడీపీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగిశెట్టిని నివారించేందుకు విఫలయత్నం

వైసీపీ నేతలు మంగిశెట్టి శ్రీనివాసరావు టీడీపీలో చేరుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి.. శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి పార్టీ మారకుండా చేసేందుకు విఫలయత్నం చేశారు. శ్రీనివాసరావుతో వసంతకుమారి మంతనాలు జరిపి తిరిగి కారు వద్దకు వచ్చి శ్రీనివాసరావును కారులోకి ఎక్కించింది. అకస్మాత్తుగా జరిగిన సంఘటనకు శ్రీనివాసరావు అభిమానులు కారుకు అడ్డుగా నిలబడి కారులోనుండి శ్రీనివాసరావును కిందకుదింపారు. వసంతకుమారి వెళ్లిపోగానే ప్రవీణ్ శ్రీనివాసరావుకు భరోసా ఇచ్చి పార్టీ చేరిక కార్యక్రమానికి తీసుకుని వెళ్లారు.

2న యూటీఎఫ్ రాష్ట్ర విద్యాసదస్సు

గుంటూరు(విద్య), ఏప్రిల్29: ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవంలో భాగంగా మే2న బాపట్లలో రాష్ట్ర విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ మేరకు గుంటూరులోని కార్యలయంలో సోమవారం పోస్టర్స్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం కళాధర్, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షులు వెంకటేశ్వర్లు, శివ పార్వతి, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసమే బీజేపీతో పొత్తు

- ఏ ఒక్క ముస్లింకి అవమానం జరిగినా రాజీనామా చేస్తా
- గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని

మేడికొండూరు, ఏప్రిల్ 29: రాష్ట్రాభివృద్ధి కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందని, తాను ఎంపీగా గెలిచిన తరువాత ఏ ఒక్క ముస్లింకు అవమానం జరిగినా తన పదవికి రాజీనామా చేస్తానని, ఇది అల్లా సాక్షిగా ప్రమాణం చేస్తున్నానని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం మండంలోని కొర్రపాడు, మందపాడు, వరగాని, సిరిపురం గ్రామాల్లో జరిగిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం అప్పులమయం, రాజధాని ముందుకు వెళ్లే పరిస్థితి లేదు, పోలవరం ఆగిపోయింది, జలజీవన్ మిషన్లో కొన్ని వేల కోట్లు ఉన్నాయి, రాష్ట్రానికి 20 లక్షల మంజూరై ఉన్నాయి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకువచ్చి వీటికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు కలిపితే రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో చూడవచ్చని తెలిపారు. ఇవన్నీ జరగాలంటే కేంద్ర ప్రభుత్వంతో విభేదిస్తూ కూర్చుంటే పనులు కావనే వాస్తవాన్ని ముస్లిం సోదరులు అర్థం చేసుకోవాలని కోరారు. కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. జాతీయ నాయకుడైన చంద్రబాబు నాయుడు ఎన్నో అవమానాలను భరించి బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు, గతంలోను బీజేపీతో పొత్తుకున్నా ఏ ముస్లింకు అన్యాయం జరగనీయలేదని అన్నారు. అబ్దుల్ కలామ్ వంటి వారిని రాష్ట్రపతిని చేసిన ఘనత చంద్రబాబుదని కొనియాడారు. జగన్ హయాంలో ఎంతమంది ముస్లింలకు అన్యాయం జరిగిందో ఆలోచించాలన్నారు. టీడీపీ బీజేపీకి మద్దతు ఇవ్వటం తప్పంటే మరి వైసీపీ గెలిస్తే ఎవరికి మద్దతిస్తారో చెప్పాలన్నారు. జగన్ కేసుల కోసం బీజేపీకి అడిగీ అడగకముందే మద్దతు ఇవ్వడం నిజం కాదా అని డాక్టర్ పెమ్మసాని ప్రశ్నించారు. రాజ్యసభతో కలిపి 31మంది ఎంపీలుంటే ఏనాడైన ముస్లింలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించారా అని అడిగారు. నాలుగు శాతం ముస్లిం రిజర్వేషన్ల విషయాన్ని తాము ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.


మందపాడులో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని, పక్కన శ్రావణ్‌కుమార్


ప్రచార సభకు హాజరైన ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులు

తాడికొండ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణకుమార్ మాట్లాడుతూ నాడు చంద్రబాబును నమ్మి రైతులు 33వేల ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇచ్చారు. అసెంబ్లీ సాక్షిగా జగన్ అమరావతి రాజధానిగా అంగీరించి మోసం చేశాడు. అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిని సర్వనాశనం చేశాడని విమర్శించారు. తాను ఇక్కడే ఇళ్లు కట్టుకున్నానని, చంద్రబాబు చెప్పిన రాజధాని కంటే గొప్పగా అమరావతిని తీర్చిదిద్దుతానని జగన్ చెప్పలేదా అని అడిగారు. రాష్ట్రం మధ్యలో ఉన్న ప్రాంతాన్ని రాజధానిగా అందరూ అంగీకరించినందునే ఇక్కడ రాజధాని ఏర్పాటు అయిందని అన్నారు. రాజధాని పూర్తయితే మన పిల్లల ఉద్యోగాలు వస్తాయని, మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశపడి ప్రభుత్వానికి భూములు ఇస్తే వైసీపీ అధికారంలోకి వచ్చాక అమరావతిని సమూలంగా నాశనం చేయడం కాకుండా మూడు రాజధానులని జగన్మోహన్ రెడ్డి ప్రజల్ని మోసం చేస్తున్నాడని దుయ్యబట్టారు. ర్యాలీలో మాజీ జడ్పీటీసీ సభ్యులు గుంటుపల్లి సాంబశివరావు, పాములపాటి శివన్నారాయణ, ఫిరంగిపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు గడ్డం రాంబాబు, షేక్ అబ్దుల్ గఫూర్, మర్రిపూడి రాంబాబు, కడియాల గణేష్, తాడికొండ జనసేన నాయకుల బేతపూడి విజయశేఖర్ తదితరులతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

- టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

పెదకాకాని, ఏప్రిల్ 29: ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమని గుంటూరు పార్లమెంట్ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రతి సోమవారం పెదకాకాని స్వస్థితశాల(తోట)లో జరిగే ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ కాకాని స్వస్థతశాల గురించి తెలుసుకున్నామని, ఎంతో మహిమాన్విత ప్రదేశంగా ఆయన కొనియాడారు. వేలాదిమంది భక్తులు ఇక్కడికి వచ్చి జరిగే ప్రార్థనలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉన్నారు. క్రీస్తు బోధనలో శాంతి, దయ, కరుణ, ప్రేమ వంటి వాటిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని, అప్పుడే ప్రపంచశాంతి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. అనంతరం డాక్టర్ జె.శామ్యూల్ కిరణ్‌చే ప్రత్యేక ప్రార్థనలు జరిపించి, ఆశీర్వచనం పొందారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ (పొన్నూరు), తెనాలి శ్రావణ్‌కుమార్(తాడికొండ), మొహమ్మద్ నసీర్ అహ్మద్(గుంటూరు తూర్పు), బీసీ సంఘం నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, పెదకాకాని మండల టీడీసీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


స్వస్థిత శాలలో పెమ్మసాని, ధూళిపాళ్ల, శ్రావణ్‌కుమార్, నసీర్ తదితరులు


పైపును పగలకొట్టడంతో వృధాగా పోతున్న తాగు నీరు

జగనే సభ కోసం తాగునీరు పైప్‌లైన్ ధ్వంసం

పొన్నూరుటౌన్, ఏప్రిల్29: పొన్నూరు పట్టణంలో సోమవారం జరిగిన వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సభ కోసం మంచినీటి పైప్‌లైన్ ధ్వంసం చేసిన సంఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో సోమవారం సీఎం సిద్ధం సభ జరిగింది. ఈ సభ కోసం బారికేడ్లు పాతేందుకు రోడ్లకు యంత్రాలతో డ్రిలింగ్ చేశారు. రేపల్లె బస్టాండ్ సెంటర్ వద్ద డ్రిలింగ్ చేస్తుండగా మంచినీటి పైప్ లైన్ ధ్వంసమై నీరు ఎగజిమ్మి వృధాగా పోయింది.

ప్రభుత్వాస్పత్రిలో రోగులకు షాక్ ట్రీట్‌మెంట్

- రూ.10 లక్షలతో ఈసీటీ పరికరాలు ఏర్పాటు

గుంటూరు (మెడికల్), ఏప్రిల్ 29: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి మానసిక వ్యాధుల వైద్య విభాగంలో కొత్తగా షాక్ ట్రీట్‌మెంట్ (ఎలక్ట్రో కన్వల్షన్ థెరపీ/ఈసీటీ) చికిత్సలను అందుబాట్లోకి తెచ్చారు. సోమవారం జీజీహెచ్ మానసిక జబ్బుల వైద్య విభాగంలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఈసీటీ రూమ్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ ప్రారంభించారు. మత్తు వైద్య నిపుణుల సహకారంతో రోగులకు సైకియాట్రిస్టులు షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తారని ఆయన వివరించారు. దాతలు శ్రీనివాస్, రాంబాబు, శోభన్‌బాబు షాక్ ట్రీట్‌మెంట్ ఛాంబర్ ఏర్పాటుకు తగిన తోడ్పాటు అందించినట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మానసిక జబ్బుల వైద్యవిభాగాధిపతి డాక్టర్ ఎస్.ఉమాజ్యోతి, మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నరేష్‌బాబుకు థామస్ వైట్ క్లాడ్ అవార్డ్

గుంటూరు (మెడికల్) ఏప్రిల్ 29: గుంటూరు నగరానికి చెందిన సీనియర్ స్పైన్ సర్జన్ డాక్టర్ జె.నరేష్‌బాబు, సర్వైకల్ స్పాండిలోసిస్ వ్యాధిపై సమర్పించిన పరిశోధన పత్రానికి అంతర్జాతీయ స్థాయిలో థామస్ వైట్ క్లాడ్ అవార్డు లభించింది. కాలిఫోర్నియాలోని శాండియాగోలో ఇటీవల జరిగిన స్కోలియోసిస్ రీసెర్చ్ సొసైటీ 31వ వార్షిక సదస్సులో డాక్టర్ నరేష్‌బాబు ఈ అవార్డు అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా అందిన 1500 పరిశోధన పత్రాలను పరిశీలించి తొలి 100 పేపర్లను పోడియం ప్రదర్శనకు ఎంపిక చేశారు. వీటిలో మొదటి 15 పేపర్లు అవార్డుకు ఎంపిక చేశారు. ఇందులో కూడా న్యాయ నిర్ణేతలు, డాక్టర్ల పోల్ ఆధారంగా ఉత్తమ పరిశోధన పత్రాన్ని ఎంపిక చేశారు. సోమవారం గుంటూరులోని మల్లిక స్పైన్ సెంటర్‌లో డాక్టర్ నరేష్‌బాబు విలేకర్లతో మాట్లాడుతూ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.


అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేష్‌బాబు

బాబాయిని చంపిన
యువకుడికి జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 29: స్వల్ప వివాదం నేపథ్యంలో బాబాయిని చంపినట్టు నేరం అంగీకరించటంతో నిందితుడు పట్టణంలోని క్రిష్టియన్ పాలెంకు చెందిన రేపూడి కళ్యాణ్‌బాబు (29)కు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ ఏడాది జనవరి 6న రేపూడి రాజు తన ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా కళ్యాణ్ బాబు పాత వివాదం నేపథ్యంలో కట్టెను తీసుకొని విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య కోటేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసుకున్న సీఐ ఎ.భాస్కర్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలుచేశారు. కోర్టులో చేసిన నేరం గురించి న్యాయాధికారి నిందితుడిని ప్రశ్నించగా కల్యాణ్‌బాబు నేరం అంగీక రించాడు. దీంతో జడ్జి పై విధంగా శిక్షను వెలువరించారు.


రేపూడి కళ్యాణ్ బాబు(ఫైల్)

జొన్న పంట దహనం..

- రూ. 2 లక్షల నష్టం ● వైసీపీ దుండగుల దుశ్చర్య

కారంపూడి, ఏప్రిల్ 29: చేతికొచ్చిన పంటను సైతం వదలడం లేదు వైసీపీ దుండగులు. నోటి కాడికి వచ్చిన జొన్నపంటను నిర్థాక్షిణ్యంగా తగులబెట్టిన ఘటన మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. గ్రామానికి చెందిన కొమ్ము ఏసోబు ఐదెకరాల్లో జొన్న సాగుచేశారు. ఆదివారం పంటను కోసి బోరాల్లోకి ఎత్తి పొలంలోనే ఉంచాడు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి బోరాలు కాలిపోయి ఉన్నాయి. రూ.2 లక్షల దాకా నష్టం వాటిల్లిందని బాధితుడు ఏసోబు తెలిపారు.

ఏసోబు గ్రామంలో టీడీపీ పక్షాన చురుకుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల అభ్యర్థి బ్రహ్మారెడ్డిలు పెదకొదమగుండ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఏసోబు, అతని మేనల్లుడు ఏసుబాబులు పాల్గొని గ్రామం నుంచి జనసమీకరణ కూడా చేశారు. అంతేకాక ఈనెల 24న జరిగిన కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి నామినేషన్‌కు వెళ్లారు. దీంతో వైసీపీ నేతలు అతనిపై కక్ష పెంచుకున్నారు. పార్టీ మారాలని, వైసీపీ కండువా కప్పుకోవాలని బెదిరింపులకు దిగారు. అందుకు వారు అంగీకరించలేదు. దీంతో చేతికొచ్చిన పంటను నిర్దాక్షిణ్యంగా తగులబెట్టారు. కాగా బాధితుడు ఏసోబు కారంపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇదే గ్రామంలో ఈనెల 20న ఎస్సీ సామాజిక వర్గానికిచెందిన కొమ్ము పేరయ్యకు చెందిన నీళ్ల మోటారు, పైపులను ధ్వంసం చేశారు. ఈనెల 18న ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు నామినేషన్‌కు జనసమీకరణ చేశాడనే కక్షతోనే పేరయ్యకు ఆస్తినష్టం కలిగించారు వైసీపీ రౌడీ మూకలు. గ్రామంలో దళితులను టార్గెట్ చేస్తూ దాడులు జరుపుతున్నారు.


తగులబడిన జొన్న పంట, బూడిదైన పంటను చూపుతున్న ఏసోబు


శ్రీకృష్ణదేవరాయలుతో కేక్ కట్ చేయిస్తున్న జీవీ ఆంజనేయులు, మక్కెన, ధారునాయక్

అధికారంలోకి రాగానే ఇంటింటికి తాగు నీటి కుళాయి ..

- నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీ కృష్ణ దేవరాయలు
- బొల్లా అవినీతి, అక్రమాలపై విచారణ చేయిస్తా.. జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, ఏప్రిల్ 29 : ఇప్పటికే తాను వరికపుడిసెల అనుమతులు తీసుకువచ్చానని, కూటమి ప్రభుత్వం రాగానే జీవీ ఆంజనేయులతో కలసి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేసి ఇంటింటికి తాగు నీటి కుళాయిని ఏర్పాటు చేస్తామని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని సోలాయపాలెం, గండిగనుమల, దోమలగుండం, దోమల గుండం తండా, మేకల దిన్నె, అయ్యన్నపాలెం, గుమ్మనం పాడు, గరికపాడు, పమిడిపాడు గ్రామాల్లో సోమవారం వినుకొండ నియోజక వర్గ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయుల, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులతో కలసి లావు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కృష్ణాజలాలను బొల్లాపల్లి మండలానికి తీసుకు వస్తామన్నారు. బ్రహ్మనాయుడు అవినీతి, అక్రమాలపై విచారణ చేయిస్తామన్నారు. గ్రామాల్లో తాగు నీరు లేక అల్లాడి పోతుంటే ఎమ్మెల్యే బొల్లా ఈ ఐదు సంవత్సరాల్లో కనీసం ఒక్కసారైనా గ్రామాల్లో వెళ్ళిన దాఖలాలు ఉన్నాయా? అని పశ్నించారు. టీడీపీ హయాంలో వేసిన రోడ్ల మీదనే ఇప్పటికీ ప్రజలు తిరుగుతున్నారన్నారు. గ్రామాల్లో కనీసం మురుగు కాలువలు కూడా కట్టించేందుకు చేతగాని దద్దమ్మలు వైసీపీ నేతలని దుయ్యబట్టారు. సూపర్ 6 పథకాలను వివరించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులకు రూ.4వేలు పింఛన్లను అందచేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తదితర పథకాల గురించి వివరించారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. మంచి, చెడును చూసి ఓటు వేయాలన్నారు. అహంకార ఎమ్మెల్యేను గద్దె దించాలని పిలుపునిచ్చారు. బొల్లాపల్లి మండలంలో ప్రతి ఊరు ప్రచారానికి వచ్చిన కూటమి నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు జన్మదినం సందర్భంగా ప్రతి గ్రామాలో కేక్‌ను కట్ చేసి కృష్ణ దేవరాయలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో పార్టీ నేతలు ధారునాయక్, గోవిందు నాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, జారు నాయక్, కోట నాయక్, హనుమా నాయక్, ఆరికట్ల వాసుదేవరెడ్డి, బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, అర్ధలపూడి శ్రీనివాసరావు, ఆళ్ళ మన్నెయ్య, గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, వెలిశెట్టి నరసింహారావు, యర్రంశెట్టి జయరావు, పరిటాల రామచంద్రయ్య తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, కూటమి సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తదితరులు

ప్రజలను నయవంచన చేస్తున్న జగన్

- పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, ఏప్రిల్29: పొన్నూరు ప్రజలను మరోసారి నయవంచన చేయటానికి జగన్మోహన్‌రెడ్డి పొన్నూరు వస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. చింతలపూడి డీవీసీ కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఒక ఛాన్స్‌ను ఉపయోగించుకొని రాష్ట్రాన్ని జగన్, పొన్నూరులో కిలారి వెంకట రోశయ్య దోచుకున్నారన్నారు. పొన్నూరు ప్రజల సంపద రూ.2,540 కోట్లు దోచుకున్నారని సాక్ష్యాలతో సహా ప్రజాచార్జి షీట్‌ను దాఖలు చేశామన్నారు. తాము ఆరోపణలు చేసిన ప్రతిసారి జగన్ రెడ్డి ఎమ్మెల్యే రోశయ్యను పిలిపించి కప్పం కట్టించుకొని పంపించి వేశారని ఎద్దేవా చేశారు. పొన్నూరులో రేషన్, మద్యం, గంజాయి మాఫియా, సెటిల్‌మెంట్లు ఐదేళ్ల కాలంలో చెలరేగిపోయారని ఆరోపించారు. రేషన్ వ్యాపారి దళితుడైన అంజి బర్నబాసు అనే వ్యక్తిని ఎమ్మెల్యే అయిన అనుచరులు కిరాతకంగా హత్య చేసారని ఆరోపించారు. అనమర్లపూడి గ్రామంలో 50 ఏళ్లగా హక్కుల కోసం పోరాడుతున్న దళితుల భూములు 50 కోట్లు విలువ చేసే 22 ఎకరాల భూమిని ఎమ్మెల్యే రోశయ్య బినామి దారులకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ధ్వజమెత్తారు. ధాన్యం, మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లలో రైతులను దోచుకున్నారని ఆరోపించారు. పొన్నూరు పట్టణంలో అమాయిక ఆర్యవైశ్యులను బెదిరించి రోడ్డు విస్తరణ పేరుతో అడ్డగోల్లుగా భవనాలను కూల్చివేశారన్నారు. పాదయాత్ర సందర్భంగా కొమ్మమూరు కాల్వ, హైలెవల్ ఛానల్ ఆధునికీకరణ గురించి మాట్లాడిన జగన్ ఐదేళ్ల కాలంలో ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. గుంటూరు ఛానల్ అభివృద్ధికి తాము తెచ్చిన నిధులు కూడా వదిలేసారని ఆరోపించారు. చేబ్రోలులో వికలాంగుడైన ముస్లి మైనార్టీ హత్య, నారాకోడూరులో మార్కెట్ యార్డు ఉద్యోగి బాషా హత్యపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ప్రజలను నయవంచన చేసిన జగన్ రెడ్డి పొన్నూరు ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జనసేన చేబ్రోలు మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, దేశంశెట్టి సూర్య, తదితరుల తోపాటు టీడీపీ, బిజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మల్లెల వెంకటరావు, పాల్గొన్న దళిత సంఘు నాయకులు

దళితులపై జగన్‌ది కపట ప్రేమ

- మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకటరావు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27: నా ఎస్సీ, ఎస్టీ అన్ని చెప్పి కమట ప్రేమ చూసి ఆయా వర్గాల ఓట్లతో గద్దెనెక్కిన సీఎం జగన్‌ను గద్దెదించటమే లక్ష్యంగా మాలలు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తారని మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు తెలిపారు. సోమవారం అరండల్‌పేటలోని ఓ హోటల్లో మాలల ఐక్యసంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలకు మేనల్లుడిగా చెప్పుకునే జగన్ మాలలనే హత్య చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నమ్మి ఓట్లు వేసి అధికారంలోకి తీసుకు వస్తే ఎస్సీలనే హత్యలు చేసి శవాలను ఇళ్లకు పంపించిన ఘనుడు జగన్ అని విమర్శించారు. రాజ్యాంగం నిర్దేశించిన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను మొత్తం రద్దు చేసి రూ.70 వేల కోట్లు సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించారన్నారు. రానున్న ఎన్నికల్లో మాల సంఘాల ఐకాస టీడీపీకి సంపూర్ణ మద్దతు తెలియచేస్తూ, ఆ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కొండపల్లి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

శక్తివంతమైన ప్రాంతం అమరావతి

- 1595వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్లూరు, ఏప్రిల్ 29: అమరావతిని నాశనం చేద్దామనుకుంటే వైసీపీ వారికి తగినశాస్తి జరుగుతుందని 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. అమరావతి జోలికి వచ్చి ఇప్పటికే వైసీపీ పాలకులు భ్రష్టు పట్టి పోయారని అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్‌ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు సోమవారం నాటికి 1595వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, శక్తివంతమైన అమరావతి జోలికివచ్చి సీఎం జగన్‌రెడ్డి ఇంటికి వెళ్లటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చేది విజనరి ప్రభుత్వమన్నారు. అమరావతిని నిలబెడతారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.


వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

79,660 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 90,353 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 79,660 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 53,394 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000
నెంబరు. 5	9000	14500
273	10000	14500
341	9500	16500
4884	10000	15000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	9500	15000
దేవనూరు డీలక్స్	8500	15000
తెల్లకాయలు	5000	11500

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00



పేరలి బాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన శీలంవారిపాలెం రెడ్డి కులస్థులు

వైసీపీ నుంచి టీడీపీలోకి 26 మంది చేరిక

కర్లపాలెం, ఏప్రిల్ 29 : మండలంలోని సమ్మెటవారిపాలెం పంచాయతీ శీలంవారిపాలేనికి చెందిన 26 మంది వైసీపీ వారు డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నరేంద్రవర్మ వైసీపీ నుంచి వచ్చినవారికి టీడీపీ కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పిట్టు శ్రీనివాసులరెడ్డి, వీరారెడ్డి, రామకృష్ణారెడ్డి, దేవేంద్రరెడ్డి, కొండలురెడ్డి, కొండలమ్మ, నాగేంద్రరెడ్డి, బుజ్జిరెడ్డి, బుల్లిరెడ్డి, దిడ్ల వీరారెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జనసేన నాయకులు నామన శివన్నారాయణ, గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణప్రాంతాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం : హరికుమారి



మేనిఫెస్టోను ఓటర్లకుతెలియజేస్తున్న హరికుమారి, డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 29 : గ్రామీణప్రాంతాల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని బాపట్ల నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సతీమణి వేగేశన హరికుమారి అన్నారు. మండలంలోని కోమలి గ్రామపంచాయతీలోని వివిధ గ్రామాలలో గ్రామ, మండలస్థాయి కూటమి నాయకులతో కలిసి సోమవారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. టీడీపీ రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలతోపాటు, లోకల్ మేనిఫెస్టోను టీడీపీ అధికారంలో రాగానే అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కోమలి గ్రామ టీడీపీ నాయకులు, బాపట్ల నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కె.కిషోర్‌రెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కె.సాంబమూర్తిరాజు, ఎం.శంకరరెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు వెంకటపతిరాజు, శ్యామలమోహనరెడ్డి, జి.నవరాజు, బుజ్జి, కృష్ణారెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు శ్యామల సత్యనారాయణరెడ్డి, భవనంవారిపాలెం గ్రామసర్పంచ్ ఎం.శివనాగేశ్వరి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎండిఅఫ్జల్, మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీయువనాయకులు కొత్తపల్లి పృద్వీరాజ్, ఖాజీపాలెం గ్రామ అధ్యక్షుడు దండు శ్రీనివాసరాజు, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ ఖాశీం, మాజీ సర్పంచ్ మంతెన శ్రీదేవికృష్ణమూర్తిరాజు, నిజాం పట్నం నాగరాజు, మాజీ ఎంపీపీ బొలగాని సులోచన నారాయణ, పార్టీ నాయకులు కె.చక్రధర్‌రెడ్డి, చందోలు గ్రామ టీడీపీ యువనాయకులు సయ్యద్ నిజాం, మండల జనసేన అధ్యక్షులు హుస్సేన్‌బేగ్, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మద్దాల డేవిడ్, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, నాయకులు అన్నపురెడ్డి సుబ్బారెడ్డి, బేతాళం నరసరాజు పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి ఆలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి



గోవర్ధనరెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సామాజిక వర్గీయులు, కూటమినాయకులు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 29 : మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి సోమవారం నియోజకవర్గంలోని పలువురు రెడ్డి సామాజిక వర్గీయులతో, కూటమి నాయకులతో కలిసి చందోలులో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలువురు నాయకులు చీరాల గోవర్ధనరెడ్డిని పూలమాలలతో, దుశ్శాలువాలతో సత్కరించారు. చందోలులోని టీడీపీ కార్యాలయానికి విచ్చేసిన చీరాల గోవర్ధనరెడ్డిని చందోలు గ్రామ, మండల, కర్లపాలెం, బాపట్ల పట్టణ, రూరల్ మండలాలకు చెందిన టీడీపీనాయకులు, పలువురు రెడ్డి సామాజికవర్గీయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పలువురు టీడీపీ నాయకులు పూలమాలలతో, దుశ్శాలువాలతో సత్కరించారు. పలువురు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, బాపట్ల పార్లమెంట్ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌ల విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పిట్టలవానిపాలెం మండల, చందోలు గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అవినీతిఫుల్.. అభివృద్ధి నిల్ : జేడీ శీలం

బాపట్ల, ఏప్రిల్ 29 : వైసీపీ పాలనలో అవినీతి పెరిగిపోయి అభివృద్ధి ఏమాత్రం జరగలేదని కాంగ్రెస్ పార్టీ బాపట్ల ఎంపీ అభ్యర్థి జేడీ శీలం అన్నారు. పట్టణంలోని 12వవార్డు ఇందిరాగాంధీకాలనీ, పిట్టలవానిపాలెం మండలం చందోలుగ్రామానికి చెందిన వైసీపీ శ్రేణులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జేడీ శీలం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేవిధంగా వైసీపీ పాలన కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరాజు, మహిళా అధ్యక్షురాలు దుండురేణుక, సీనియర్ నాయకులు చింతా బాబురావు, ఎస్‌వీఆర్‌కుమార్, గంటా నవీన్, పి.శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 12వ వార్డు ఇందిరానగర్ కాలనీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గంటా అంజిబాబు, జెడి.శీలంలు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ మేనీఫెస్టో గురించి వివరిస్తూ ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీనాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు

● రేపల్లె, గుంటూరు ప్రధానరహదారిపై ఖాళీ డ్రమ్ములు బిందెలతో ఆందోళన



రోడ్డుపై ధర్నా చేస్తున్న వార్డు ప్రజలు

రేపల్లె, ఏప్రిల్ 29: వేసవిలో తాగు నీరు అందటం లేదంటూ పట్టణ వాసులు మున్సిపల్ నాయకులు, అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని 28వవార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని 28, 1వార్డు ప్రజలు రేపల్లె, గుంటూరు ప్రధాన రహదారిపై ఖాళీ నీటి డ్రమ్ములు పెట్టి తాగునీరు అందించాలంటూ ధర్నా నిర్వహించారు. దీని కారణంగా కిలోమీటరు మీరా ట్రాఫిక్ జామ్ అయింది. 11గంటల నుంచి 1గంట వరకు మండుటెండల్లో ధర్నా నిర్వహించిన మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. తాగు నీరు అందక పశువులు చనిపోతున్నాయని, కిలోమీటరు మీరా వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు ప్రజల వద్దకు వచ్చి రేపటి నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తామని హామీనివ్వటంతో ధర్నాను విరమించారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

బాపట్ల, ఏప్రిల్ 29 : ఆరున్నర దశాబ్దాలుగా బాపట్ల రోటర్లీకబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. బాపట్ల రోటర్లీ కబ్ ఆధ్వర్యంలో సూర్యలంక సముద్రతీరంలో పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 14 సిమెంట్ బల్లలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని విజయలక్ష్మీపురం రోటరీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. బాపట్ల పట్టణ, చుట్టు పక్కల ఉన్న 16 ఉన్నత పాఠశాలల నుంచి 10వ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. అదేవిధంగా వివిధ రంగాలలో నిష్ణాతులైన ప్రముఖులను సన్మానించారు. వక్కలగడ్డ రాధాకృష్ణమూర్తి(హిందీపండిట్), మన్నె శ్రీనివాసరావు (ప్రముఖ రచయిత), డాక్టర్ వి.శ్రీనివాసరావు (వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్) భారతీయరెడ్డి (ఉపాధ్యాయులు), బి.ఎస్.నారాయణభట్టు (రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్), బత్తుల శివరామకృష్ణ (ప్రధానోపాధ్యాయులు), బాషా (జర్నలిస్ట్), నటరాజన్ (రామకృష్ణ సేవా సమితి కార్యదర్శి), యాతం సౌజన్య (ఉపాధ్యాయిని)లను సన్మానించారు. నిరుపేద మహిళలు ముగ్గురికి కుట్టుమిషన్లు, జిల్లా గ్రంథాలయానికి 10 కుర్చీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రావూరి వీర రాఘవయ్య, కార్యదర్శి కోళ్ళపూడి ఉపేంద్రగుప్తా, కోశాధికారి శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ సుధీర్‌కుమార్, రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి పాలనతో అభివృద్ధి, సంక్షేమం

● అన్ని వర్గాలకు మేలు చేసే మేనిఫెస్టో

● మాజీ మంత్రి ఆనందబాబు



కాకర్లమూడిలో ఆనందబాబుకు తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు

వేమూరు, ఏప్రిల్ 29 : రాష్ట్రం, రాష్ట్ర ప్రజల అభివృద్ధి సంక్షేమాన్ని కాంక్షించి తెలుగుదేశం జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడ్డాయని వేమూరు అసెంబ్లీ అభ్యర్థి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. సోమవారం మండలంలోని చదలవాడ, కాకర్లమూడి, వెల్లబాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. తెలుగుదేశం పార్టీ యువత అమ్మిశెట్టి కిషోర్‌బాబు ఆధ్వర్యంలో గజమాలతో పూల కిరీటంతో ఆనంద్‌బాబును సత్కరించారు. ఆనందబాబు ఓటర్లను స్వయంగా కలసి మ్యానిఫెస్టో కరపత్రాలను అందించారు. ముఖ్యంగా మహిళలు వృద్ధులు, యువతతో మాట్లాడారు. ప్రచార రథంపై నుంచి ప్రసంగిస్తూ జగన్ తాను ఓడిపోతే మూడు నెలల్లో జైలుకు వెళ్ళడం ఖాయం అన్న విషయం తనకు తెలుసని అందు కోసం గాని అనేక జిమ్మిక్కులతో తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ప్రజలను మరోసారి మోసం చేయడానికి ప్ర యత్నం చేస్తున్నాడని అన్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న అన్ని వర్గాల వారికి న్యాయం జరగాలన్న మరి ముఖ్యంగా రైతులకు సంక్షేమ ఫలాలు అందాలన్నా కూటమి ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ బలపరచాలన్నారు. తనతో పాటు బాపట్ల ఎంపీగా కూటమి అభ్యర్థి కృష్ణ ప్రసాద్‌ను కూడా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టిడిపి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త ఊసా రాజేష్, బాపట్ల పార్లమెంటు తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి అమ్మిశెట్టి కిషోర్‌బాబు, బొల్లిముంత కోటేశ్వరరావు, బొల్లిముంత అమ్మయ్య, అద్దంకి శంకర్ మాలింపాటి శ్రీనివాసరావు, రాజు, పరుచూరి రమేష్, వెంకటేశ్వరరావు, చందు రత్తయ్య, అత్తోట దాసు, చాత్రగడ్డ సురేష్, కనపర్తి రమేష్ పాల్గొన్నారు.

14 రోజుల్లో రాష్ట్రానికి పట్టిన శని వదులుతోంది

● ప్రచారంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఆనందబాబు

కొల్లూరు, ఏప్రిల్ 29 : రాష్ట్రానికి పట్టిన దరిద్రం, శని మరో 14 రోజుల్లో వదలబోతోందని మాజీ మంత్రి, టీడీపీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు జోస్యం చెప్పారు. సోమవారం మం డలపరిధిలోని రావికంపాడు, తాడిగిరిపాడు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఆనందబాబుకు అడుగడుగునా జనం నీరాజనాలు, మహిళలు హారతులు ఇచ్చి స్వాగతించారు. ప్రచారంలో ఆయన మాట్లాడు తూ 2019లో తనపై గెలిచిన వ్యక్తి మంత్రి అయి కూడా ఈ గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని, ఎన్నికలకు ఆరు నెలల ముందు ఇక్కడ పోటీలో లేకుండా పారిపోయాడని, అతని స్థానంలో మరో వ్యక్తి వచ్చాడని, అతను ఎలాంటి వాడో ఎవరికీ తెలియదన్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, జొన్నలగడ్డ విజయబాబు, పార్టీ నాయకు లు యలవర్తి కోటేశ్వరరావు, తుమ్మల బాపయ్య చౌదరి, పులివర్తి నాంచారయ్య, దొడ్డపనేని వెంకటేశ్వరరావు, కనపర్తి సంగీతరావు, పోతార్లంక శివశంకరచారి, పోతార్లంక నాగేశ్వరరావు, గుమ్మడి శివ, జీఎల్‌జీ భగవాన్, గొరికపూడి ప్రసాద్, కాసరనేని మోహన్, వేములపల్లి మోహనకృష్ణ, నాగళ్ల వెంకటకృష్ణారావు, కొడాలి నారాయణ, జనసేన నాయకులు బొందలపాటి చలమయ్య పాల్గొన్నారు.



తాడిగిరిపాడులో ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి ఆనందబాబు

రేపల్లె చరిత్రను తిరగరాయాలి

● కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి మంచి రోజులు

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



తాడివాకవారిపాలెంలో ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 29: తీరప్రాంత రేపల్లె చరిత్రను అభివృద్ధితో తిరగరాసేందుకు ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించి అఖండ మెజార్టీని ఇవ్వాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం నగరం మండలం తాడివాకవారిపాలెం, పెదమట్లపూడి, దాసరిపాలెం, ఈదుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి మంచి రోజులు రావాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ప్రభుత్వ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌ను మహోన్నత రాష్ట్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఎన్నో రహదారులు మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం రాగానే వాటిని రద్దు చేశారన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారు అభ్యున్నతి కోసం టీడీపీ ప్రభుత్వం ఎనలేని కృషి చేసిందని జగన్‌రెడ్డి ప్రభుత్వంలో పథకాల పేరుతో ప్రజలకు రూ.10లు ఇచ్చి రూ.100లు దోచుకుతిన్నారన్నారు. నగరం మండలంలో సాగునీటి కొరత తీవ్రంగా ఉందని, ఎత్తిపోత పథకాలను అభివృద్ధి చేయటంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయటంతో ఈఏడాదే ఖరీఫ్ సీజన్‌లో లక్షలాది రూపాయల పంటను రైతులు నష్టపోయారన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీరప్రాంతంలోని పంట కాల్వలన్నీ అభివృద్ధి చేసి చివరి భూముల వరకు సాగునీరు అందిస్తామని తెలిపారు. మైనార్టీల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు రాష్ట్ర కార్యదర్శి మేకా వెంకట శివరామకృష్ణ, లుక్కా గుడారంకయ్య, జడ్పీటీసీ మాన్యం నాగమణి, విచారపు వీరయ్య, చింతల సుబ్బారావు, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, జనసేన నాయకులు మత్తి భాస్కరరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



దాసరిపాలెంలో ఎమ్మెల్యే అనగానిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నేతలు

సంకీర్ణ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన



ప్రజలకు అభివాదం చేస్తున్న నరేంద్రవర్మ, కృష్ణప్రసాద్

బాపట్ల, ఏప్రిల్ 29 : రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సంకీర్ణ ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బాపట్లలోని 24, 25 వార్డులలో ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్, నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఓ మహిళ నెట్టుడు బండిపై టిఫెన్ సెంటర్ ఏర్పాటు చేసుకొని జీవిస్తుండగా అక్కడకు వెళ్ళి నరేంద్రవర్మ అట్లు పోస్తూ ఆమెకు అవుతున్న ఖర్చు వస్తున్న లాభం గురించి అడిగి తెలుసుకొని సంకీర్ణ ప్రభుత్వం వస్తే ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు ఇవ్వటం జరుగుతుందని, ప్రతినెల రూ.1500 ఆర్థికసాయం ఇవ్వటంతోపాటు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. వైసీపీ పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలను తొలిగించి ప్రతి కుటుంబం సంతోషంగా ఉండేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని భరోసానిచ్చారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో ఏర్పడే డబల్ ఇంజన్ ప్రభుత్వంలో ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ కోసం రాజకీయాలలోకి వచ్చానని ఒక్కసారి గెలిపించి సేవచేసే భాగ్యాన్ని కల్పించాలని అభ్యర్థించారు. అన్నిరకాలుగా బాపట్ల పార్లమెంట్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో బాపట్లకు ప్రత్యేక స్థానం ఉండేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, బీజేపీ నాయకులు భావన్నారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ కట్టుబోయన రమేష్, తెలుగు యువత నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేష్, మహిళా నాయకులు పల్లం సరోజినీ, కూచిపూడి ఝాన్సీరాణి, దగ్గుమల్లి రాణి, షేక్ నజ్మా, దండమూడి సంధ్యారాణి, కాగిత నాగభూషణమ్మ పాల్గొన్నారు.

కాల్వలు ప్రక్షాళన చేస్తాం.. రైతులను ఆదుకుంటాం

కర్లపాలెం, ఏప్రిల్ 29 : సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమం దృష్ట్యా కాల్వలను, డ్రైనేజీలను ప్రక్షాళన చేస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. కర్లపాలెం మండలంలోని బుద్ధాం, యాజలి, దమ్మనవారిపాలెం గ్రామాలలో సోమవారం నరేంద్రవర్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాగు, సాగునీరు, వీధిలైట్లు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. గొర్రెల కాపరుల వద్దకు వెళ్ళిన నరేంద్రవర్మ గొర్రెపిల్లను ఎత్తుకొని అక్కడ ఉన్న వారిని ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, తెన్నేటి శిరీషాకుమారి, గ్రామపార్టీనాయకులు భాస్కర్‌రాజు, ముసలయ్య, శ్రీనివాసరాజు, గోకరాజు దాసురాజు, బత్తుల రామ్మూర్తి, నర్రా వాసు, మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, యెనుముల సాంబశివరావు, ఇండ్ల శ్రీనివాసరావు, రుద్రరాజు శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు అందజేసి ఓట్లు అడుగుతున్న వేగేశన నరేంద్రవర్మ

ఎన్డీఏ కూటమితోనే రజకుల అభ్యున్నతి : ఎమ్మెల్సీ దువ్వారపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

రేపల్లె, ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అనగాని గెలుపు కోసం రజక సంఘీయులంతా అండగా నిలిచి అఖండ మెజార్టీని తీసుకు వచ్చే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో రజకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో రజకులను అన్ని విధాలా మోసం చేశారన్నారు. ఈ సమావేశంలో రజక సంఘ నాయకులు మేత్ర నాగేంద్రబాబు, కొండవీటి ప్రసాదరావు, కే సోమేశ్వరరావు, ఆర్ రామయ్య, వీ సింగారావు, వెంకట సుబ్బ య్య, పోతార్లంక వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేమూరు, ఏప్రిల్ 29 : రాష్ట్రంలోని రజకులు ఆర్థికంగా బలపడాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. వేమూరు టీడీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం నియోజకవర్గ స్థాయి రజక సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామారావు మాట్లాడు తూ గతంలో ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబునాయుడు బీసీ కార్పొరేషన్ ద్వారా రజకులకు అనేక పథకాలను కల్పించి ఆర్థిక పరిపుష్టికి తోడ్పడ్డారని అన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కాకర్ల యేసుబాబు, చుండూరు శ్రీమాన్, అమర్తలూరు చంద్ర, వేమూరు చందు, నాని ప్రసాద్, కాకర్ల నాగరాజు, పోతార్లంక రాజేష్, ప్రవీణ్, మానురాజు, సురేష్, తదితరులు ప్రసంగించారు. దువ్వారపు రామారావు కాకర్ల ఏసుబాబులను సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం : అనగాని



లక్ష్మీ తిరుపతమ్మకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 29: వైసీపీ పాలనలో పంచాయతీలో అభివృద్ధి శూన్యమని పంచాయతీ నిధులు పక్కదారి పట్టించి వాడేసుకున్నారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మండలంలోని మోర్లవారిపాలెం వైసీపీ సర్పంచ్ మోర్ల లక్ష్మీతిరుపతమ్మతో పాటు 15 కుటుంబాల వారికి నిజాంపట్నం మండలం కొత్తపాలెం పంచాయతీ నక్షత్రనగర్‌కు చెందిన వైసీపీ నాయకులు మంగళగిరి శ్రీను, సైకం మీరా సాహెబ్, కన్నా వీర్రాజులకు ఎమ్మెల్యే అనగాని టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో పంచాయతీలను నిర్వీర్యం చేశారన్నారు. రాబోయే ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, డాక్టర్ వేజళ్ళ పూర్ణానంద్, తాతా ఏడుకొండలు, వేజళ్ళ కృష్ణ మోహన్, మోర్ల అంజ య్య, నాంచారయ్య, దండుప్రోలు వెంకటేశ్వరరావు, పంతాని సాయికుమార్, దండుప్రోలు పిచ్చియ్య పాల్గొన్నారు.

పెయింటర్ కిరణ్‌కుమార్‌ను పరామర్శించిన ఆనందబాబు



గాయపడిన పెయింటర్‌ను పరామర్శిస్తున్న ఆనందబాబు

కొల్లూరు, ఏప్రిల్ 29 : కూలి పనికి వెళ్లి గాయపడిన పెయింటర్ పిల్లి కిరణ్‌కుమార్‌ను మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పరామర్శించారు. సోమవారం తాడిగిరిపాడులో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఆయనకు పార్టీ గ్రామ అధ్యక్షుడు కనపర్తి సంగీతరావు ఓ యువకుడు చర్చి నిర్మాణ పనుల్లో భాగంగా పెయింట్ పనులకు వెళ్లి పైనుంచి పడి గాయపడినట్టు ఆయన దృష్టికి తీసుకెళ్లగా సదరు పెయింటర్ గృహానికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. కుటుంబానికి తాను అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన వెంట గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి లేని పాలన అందించిన ఆనందబాబు : అఖిలేశ్

భట్టిప్రోలు, ఏప్రిల్ 29 : రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి గా పని చేసిన నక్కా ఆనందబాబు అవినీతి లేని పాలన అందిం చారని క్రమశిక్షణ కలిగిన నాయకుడు ఆనందబాబు అని డాక్టర్ నక్కా అఖిలేశ్ అన్నారు. సోమవారం రాత్రి భట్టిప్రోలులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా చేసుకుని పాలన సాగిస్తారని ఆయన బాటలోనే ఆనందబాబు మంత్రిగా పని చేసి తన పదవి కి వన్నె తెచ్చారని చేసిన అభివృద్ధి గెలిపించి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు బట్టు మల్లికార్జునరావు, ఆదిన బసవపున్నయ్య, కనపర్తి సుందరరావు, శ్రీనివాసరావు, రమేష్, వంగర వీరయ్య, గాత్రం నారాయణ, ఆనంద్, ఇంతియాజ్, లంకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ వర్గాలను నిలువునా దగా చేసిన జగన్

● టీడీపీ బాపట్ల పార్లమెంటరీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీను

చుండూరు ఏప్రిల్ 29 : జగన్ ఐదు సంవత్సరాల పాలనలో ఎస్టీ వర్గాలను నిలువునా దగా చేశాడని టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు టి.శ్రీను ఆరోపించారు. సోమవారం మండలంలోని వివిధ ఎస్టీకాలనీల్లో వారు పర్యటించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్టీల సంక్షేమం కోసం ఉన్న 16 పథకాలను రద్దు చేశారు. అదేవిధంగా ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కూడా దారిమళ్ళించడం ఎస్టీ కార్పొరేషన్లకు, ఐటీడీఏలో కూడా నిధులు లేకుండా జగన్ ప్రభుత్వం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈగా రామదాసు, నియోజకవర్గ ఎస్టీసెల్ కార్యదర్శి కందుకూరి రామకృష్ణ, చలంచర్ల దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

అనగానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి : కమల



అనగానికి ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే సోదరి డాక్టర్ కమల

రేపల్లె, ఏప్రిల్ 29: రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే సోదరి డాక్టర్ కమల అనగాని అన్నారు. చెరుకుపల్లిలోని కస్తూరివారిపేట, కొత్తపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో యువత ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం విఫలం అవ్వటంతో చదువుకున్న విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వెళ్లి ఉద్యోగాలు కల్పించుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. చంద్రబాబు హయాంలో వందలాది ఐటీ కంపెనీలు తీసుకువచ్చి యువత ఉద్యోగ కల్పన చేస్తే జగన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తరలి వెళ్ళిపోయాయన్నారు. రాష్ట్రంలో మహిళలపై విపరీతంగా దాడులు హత్యలు పెరిగిపోయాయని, రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలంటే ఎన్డీయే కూటమితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కవిత, సాగర్, వర్ధిని, తుమ్మల విజయశాంతి, హైమా, టీడీపీ నాయకులు మల్లాది రామకృష్ణ, మొఖమాటం రాధాకృష్ణమూర్తి, పూషడపు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె నియోజకవర్గంలో పోటీలో 14 మంది అభ్యర్థులు : ఆర్వో

రేపల్లె, ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గం లో 14మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారాన్ తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మొత్తం 30 నామినేషన్లు రాగా వాటిల్లో 8 నామినేషన్లు తిరస్కరించగా, కొన్ని విత్‌డ్రా చేసుకోగా 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

వేమూరు అసెంబ్లీ బరిలో 15 మంది...

వేమూరు, ఏప్రిల్ 29 : వేమూరు అసెంబ్లీ ఎన్నికలకు 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. సోమవారం సాయంత్రం ఉపసంహరణ అనంతరం తుది జాబితాను విడుదల చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

నగరం, ఏప్రిల్ 29: ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జిల్లా ఎలక్షన్‌మోడల్ అధికారి వై పిచ్చిరెడ్డి అన్నారు. సోమవారం మండలం లోని అద్దంకివారిపాలెంలో మోడల్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించా రు. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ద్వారానే సమ సమాజ నిర్మాణం జరుగుతుందని ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సక్రమంగా చదువుకుంటే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చు

చెరుకుపల్లి, ఏప్రిల్ 29: విద్యార్థులు క్రమం తప్పకుండా ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను సక్రమంగా చదువుకుంటే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని గీతం కళాశాల డైరెక్టర్ రామరాజు అన్నారు. సోమవారం మండలంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సెకండ్ ఇంటర్, పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులు అం దించిన విద్యను నెమరవేసుకుంటే అత్యధిక మార్కులు సాధించవచ్చన్నారు. కళాశాల సంస్థ ఛైర్మన్ పైనం ఏడుకొండలురెడ్డి, బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

భట్టిప్రోలు, ఏప్రిల్ 29: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన భట్టిప్రోలులో జరిగింది. స్థానిక దళితవాడకు చెందిన కట్టుపల్లి చందు (25) జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇంటి గోడలను నీటితో తడిపేందుకు సోమవారం ఉదయం వెళ్లాడు. గృహాన్ని నీటితో తడపుతుండగా ఒక్కసారిగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. డాబాపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన యువకుడికి వివాహం కాలేదు, సోదరుడు, తల్లి ఉన్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.



కేంద్ర బలగాల కవాతు

పల్నాడు.. సవాలే!

● ఫ్యాక్షన్ గ్రామాల్లో భీతిల్లుతున్న ఓటర్లు
● ఎన్నికల వేళ అరాచకాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు అంటేనే పల్నాడు భీతిల్లి పోతోంది. ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో సామాన్య ప్రజలు వణికి పోతుంటారు. 12వ శతాబ్దిలో జరిగిన పల్నాటి యుద్ధం తెలిసిన ఘట్టమే. కాలక్రమేణ సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నప్పటికీ ఎన్నికల సమయాల్లో అలనాటి పలనాటి పౌరుషాలు ఇక్కడ స్పష్టంగా కనిపిస్తాయి.

మాచర్ల, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఫ్యాక్షన్ గ్రామాలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ అనేక రాజకీయ హత్యలు జరిగాయి. మాచర్ల నియోజకవర్గంలో వెల్దుర్తి, కండ్లకుంట, రెంటచింతల, మంచికల్లు, మిట్టమీదపల్లె, జమ్మలమడక, కొత్తపల్లి, అడిగొప్పల.. గురజాల నియోజకవర్గంలోని పిన్నెల్లి, కరాలపాడు, దైదా, తేలకుట్ల, గుత్తికొండ, జానపాడు.. నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్ల, విప్పర్ల, వడ్లమూరివారిపాలెం, పమిడిపాడు, కేతముక్కల అగ్రహారం, ఉప్పలపాడు.. సత్తెనపల్లి నియోజకవర్గంలోని దేచవరం, రూపెనగుంట్ల తదితర గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా గతంలో అనేక ఘర్షణలు జరిగాయి. 1991 లోక్‌సభ ఎన్నికల్లో నరసరావుపేట నియోజకవర్గం బాంబు దాడులతో అట్టుడికిపోయింది. ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన పోలీసు కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. ఈ సందర్భంగా దేశంలోనే అత్యధికంగా దాదాపు 68 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరిగింది. 2004 ఎన్నికల్లో నరసరావుపేట, గురజాల నియోజకవర్గాల్లో పలుచోట్ల బాంబు దాడులు జరిగాయి. 11 కేంద్రాల్లో రీపోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో పిన్నెల్లిలో ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. 2009 ఎన్నికల నుంచి బాంబుల సంస్కృతి కొంత తగ్గింది. అప్పటి నుంచి ఎన్నికల్లో బాంబు దాడులకు తావులేకుండా పోలీసులు ఎన్నికలు నిర్వ హించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మాచర్ల నియోజకవర్గంలో అరాచకాలు జరిగాయి. వైసీపీ మూకలు ప్రశాంత ఎన్నికలకు విఘాతం కలిగించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఎన్నికల ఎలా జరుగుతాయోనని ప్రజలు భీతిల్లి పోతున్నారు. మావోయిస్టుల ప్రభావం కూడా పల్నాడులో అధికంగానే ఉండేది. గతంతో జరిగిన ఎన్నికల్లో మావోయిస్టులు పలు విధ్వంసాలకు పాల్పడ్డారు. అయితే ఈసారి ఎన్నికల్లో మావోయిస్టుల ప్రభావం లేదనే చెప్పాలి. 2009 నుంచి జరిగిన ఎన్నికల్లో మావోయిస్టులు వలన జరిగిన ఘటనలు లేవు.

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన అనంతరం కూడా మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో అరాచకాలు చోటు చేసుకున్నాయి. దాదాపు 25 చోట్ల, దాడులు, టీడీపీ కార్యాలయాల దహనం, దాడులకు యత్నం వంటి ఘటనలు జరిగాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రశాంత ఎన్నికలు నిర్వహిస్తామని, రీపోలింగ్‌కు తావులేకుండా చేస్తామని, ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు వేసుకొనే ప్రశాంత వాతావరణ కల్పిస్తామని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఇప్పటికే ప్రకటించారు.

పోలింగ్ రోజున ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బిందు మాధవ్ హెచ్చరించారు. గత ఎన్నికల్లో జరిగిన ఘర్షణలను దృష్టిలో ఉంచుకొని అయా గ్రామాల్లో ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ బిందు మాధవ్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాటుపై ప్రణాళికను రూపొందించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో శాంతి సమావేశాలలు నిర్వహిస్తున్నారు. కేంద్ర సాయుధ బలగాలతో సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దాదాపు పదివేల మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో ప్రశాతం పోలింగ్ పోలీసులకు సవాల్‌గా మారింది. ప్రశాంత ఎన్నికల కోసం జిల్లా ఎస్పీ చేపడుతున్న చర్యలు ఏ మేరకు ఫలితాలను ఇస్తాయో చూడాలి.



జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాలు



వైసీపీ కౌన్సిలర్ మానసరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ ఆదిలక్ష్మిలకు కండువాలు కప్పి స్వాగతిస్తున్న మనోహర్, ఆలపాటి తదితరులు

నేడు తెనాలికి చంద్రబాబు

● ప్రజాగళం రోడ్ షో, బహిరంగ సభ
● ఏర్పాట్లు పరిశీలించిన ఆలపాటి, మనోహర్
● చంద్రబాబు పర్యటనతో ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లన్న నేతలు



మార్కెట్ సెంటర్ దగ్గర చంద్రబాబు సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆలపాటి, మనోహర్

తెనాలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం తెనాలిలో పర్యటించనున్నారు. కూటమి అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం చంద్రబాబు ప్రత్యేక హెలికాప్టర్‌లో తెనాలి సుల్తానాబాద్‌లో దిగతారు. అక్కడి నుంచి పట్టణంలోని సుల్తానాబాద్, చెంచుపేట, మారీస్‌పేట మీదగా మార్కెట్ సెంటర్ వరకు రోడ్‌షోగా వస్తారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు మార్కెట్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కూ టమి అభ్యర్థి, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. హెలిప్యాడ్ ప్రదేశాన్ని, సభ జరిగే మార్కెట్ సెంటర్‌ను ఇరువురు నేతలు టీడీపీ, జనసేన శ్రేణులతో కలసి సోమవారం పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ మన సత్తా చాటి చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాలన్నారు.

నేడు చంద్రబాబు సమక్షంలో చేరికలు

తెనాలిలో అధికార వైసీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. సొంత సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నాయకులే పార్టీని వీడి జనసేన కండువా కప్పుకుంటున్నారు. మరిన్ని వలసలు త్వరలో జరగనున్నాయి. తెనాలిలో సిటింగ్ ఎమ్మెల్యేనే బరిలో ఉన్నారు. అయితే పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ కూటమి క్రమంగా బలపడుతూ వస్తోంది. గతంలో చిన్నపాటి నాయకులు వైసీపీని వీడి జనసేన, టీడీపీలో చేరితే, సోమవారం వైసీపీ కౌన్సిలర్ మానసా రెడ్డి, ఆమె భర్త సతీష్‌రెడ్డి దంపతులు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ వి.ఆదిలక్ష్మి జనసేనలో చేరారు. నాదెండ్ల మనోహర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ల సమక్షంలో వీరు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. అయితే మంగళవారం తెనాలిలో చంద్రబాబు ప్రజాగళం పర్యటన ఉంది. ఈ క్రమంలో ఆ యన సమక్షంలో కూడా మరికొందరు వైసీపీ కీలక నేతలు చేరనున్నట్లు సమాచారం. పోలింగ్ నాటికి వైసీపీ ఖాళీ అవుతుందని, ఎన్నికల తర్వాత పార్టీనే కనిపించదని ఆలపాటి తెలిపారు. చేరే వారి త్యాగాలకు తగిన గుర్తింపు ఉంటుందని మనోహర్ స్పష్టం చేశారు.

స్థానం మారినా.. ఎంపీలుగా గెలుపు

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల మన్ననలతో ఒకసారి ఎంపీగా గెలిచిన వారు ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో అదే స్థానం నుంచి పోటీ చేస్తారన్న నమ్మకం ఉండటం లేదు. సామాజిక సమీకరణాలు, పార్టీల నిర్ణయంతో ఇష్టం లేకున్నా కొన్ని సందర్భాల్లో వేరే నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేయాల్సి వస్తున్నది. కొందరు మాత్రం నియోజకవర్గం మారితే మంచిదన్న అభిప్రాయంతో మారిపోతున్నారు. జిల్లాలోని పలువురు నేతలు రెండుకంటే ఎక్కువ లోక్‌సభ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహించారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి..

- డాక్టర్ కొత్తా రఘురామయ్య: పార్లమెంట్‌లో సుమారు 38 సంవత్సరాలు లోక్‌సభ సభ్యుడిగా, సుదీర్ఘ కాలం కేంద్ర మంత్రిగా పనిచేసిన కొత్తా రఘురామయ్య జిల్లాలోని రెండు లోక్‌సభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆయన 1952లో తెనాలి నుంచి, 1957 నుంచి 1980 వరకు వరుసగా ఐదుసార్లు గుంటూరు నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1977లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోయిన తరువాత రఘురామయ్య జనతా పార్టీలో చేరారు. తరువాత ఆయన అనారోగ్యంతో మృతి చెందారు.
- డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు : బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు టీడీపీ అభ్యర్థిగా జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల నుంచి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించారు. ఆయన 1996 - 98లో కేంద్రంలో దేవేగౌడ, ఐకే గుజ్రాల్ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. ఉమ్మారెడ్డి తెనాలి నుంచి 1991, 1999లో, బాపట్ల నుంచి 1996లో లోక్‌సభకు ఎన్నికయ్యారు.
- ఆచార్య ఎన్‌జి రంగా: ఆచార్య ఎన్‌జి రంగా జిల్లాలోని తెనాలి, గుంటూరుతో పాటు చిత్తూరు, శ్రీకాకుళం, ఇతర జిల్లాల నుంచి లోక్‌సభలో ప్రాతినిధ్యం వహించారు. సుదీర్ఘ కాలం పార్లమెంటేరియన్‌గా పనిచేసిన రంగ గిన్నిస్ బుక్‌లోకి ఎక్కారు. ఆయన 1957లో తెనాలి నుంచి, 1979, 1984, 1989లో గుంటూరు నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. శ్రీకాకుళం, చిత్తూరు లోక్‌సభల నుంచి కూడా ప్రాతినిధ్యం వహించారు.
- రాయపాటి సాంబశివరావు: రాయపాటి సాంబశివరావు జిల్లాలోని గుంటూరు, నరసరావుపేట నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. రాజ్యసభ సభ్యునిగా తొలిసారి చట్ట సభలకు ఎన్నికయ్యారు. రాయపాటి 1996, 1998, 2004, 2009లో గుంటూరు నుంచి, 2014లో నరసరావుపేట నుంచి ఎంపీగా గెలుపొందారు. గుంటూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా నరసరావుపేట నుంచి టీడీపీ అభ్యర్థిగా లోక్‌సభలో ప్రాతినిధ్యం వహించారు. ఈ ఎన్నికల్లో ఆయన పోటీ చేయడం లేదు.
- నేదురుమల్లి జనార్ధనరెడ్డి : జిల్లాలోని బాపట్ల, నరసరావుపేట నుంచి మాజీ సీఎం దివంగత నేదురుమల్లి జనార్ధనరెడ్డి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. ఆయన బాపట్లలో 1998లో, నరసరావుపేటలో 1999లో ఎన్నికయ్యారు. విశాఖపట్టణం నుంచి 2004లో లోక్‌సభలో కొనసాగారు. జనార్ధనరెడ్డి రాజ్యసభ సభ్యునిగా, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా, రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు.
- పనబాక లక్ష్మి : బాపట్ల నుంచి ఎంపికైన కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి అంతకు ముందు నెల్లూరు నుంచి 1996, 1998, 2004లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో ఆమె బాపట్లలో పోటీ చేసి గెలుపొందారు. కేంద్రంలో మంత్రిగా పని చేశారు. గత ఎన్నికల్లో తిరుపతి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.
- డాక్టర్ దగ్గుబాటి పురందేశ్వరి: 2004లో బాపట్ల నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరి ఆ తర్వాత విశాఖ నుంచి 2009లో గెలుపొందారు. 2004 - 2014లో మన్మోహన్ క్యాబినెట్‌లో ఆమె మంత్రిగా వివిధ శాఖలు నిర్వహించారు. విభజన తరువాత ఆమె బీజేపీలో చేరారు. 2014లో కడప జిల్లా రాజంపేటలో, 2019లో విశాఖపట్నంలో బీజేపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థిగా రాజమండ్రి నుంచి బరిలోకి దిగారు.
- మేకపాటి రాజమోహన్‌రెడ్డి: నరసరావుపేట నుంచి లోక్‌సభకు ఎన్నికైన మేకపాటి ఒంగోలు, నెల్లూరు నుంచి కూడా లోక్‌సభకు అడుగు పెట్టారు. ఆయన 1989లో ఒంగోలు నుంచి, 2004లో నరసరావుపేట నుంచి, నెల్లూరులో 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2014లో వైసీపీ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు.
- మేడూరి నాగేశ్వరరావు: గుంటూరు జిల్లాకు చెందిన దివంగత మేడూరి నాగేశ్వరరావు 1997, 1980లో తెనాలి నుంచి, 1971లో మచిలీపట్నం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

ఈ విధంగా జిల్లా నుంచి పలువురు నేతలు రెండు, అంతకంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ప్రజల మన్ననలను పొంది లోక్‌సభకు ఎన్నికయ్యారు.




డాక్టర్ కొత్తా రఘురామయ్య



మేడూరి నాగేశ్వరరావు



ఆచార్య ఎన్‌జీ రంగా



నేదురుమల్లి జనార్దనరెడ్డి



మేకపాటి రాజమోహనరెడ్డి



రాయపాటి సాంబశివరావు



పనబాక లక్ష్మి



డాక్టర్ దగ్గుబాటి పురందేశ్వరి



డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు



ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

● జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుది జాబితా విడుదల చేశాం. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియటంతో బరిలో ఉండే అభ్యర్థులు ఖరారయ్యారు. ఈ పరిస్థితుల్లో పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.. అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 12,91,716 మంది ఓటర్లు ఉన్నారని, లోక్‌సభ, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి మొత్తం 104 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిపారు. మే 13న జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 1510 పోలింగ్ కేంద్రాలు ఉండగా 337 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో డిస్పాచ్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. సిబ్బంది నియమాకం పూర్తి చేశామని, వారికి మొదటిదశ శిక్షణ పూర్తి కాగా మరోసారి శిక్షణ ఇస్తామన్నారు. హోమ్ ఓటింగ్ కొరకు దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వారి నుంచి 955 దరఖాస్తులు అందాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాలో ఓటు హక్కు ఉన్న వారికి బాపట్లలోనే ఓటు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పగటి ఉష్ణోగ్రత అధికంగా నమోదు అవుతున్నందున ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. దివ్యాంగుల కొరకు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌ఛైర్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

భద్రతా చర్యలు : ఎస్పీ వకుల్ జిందాల్

ఎన్నికలకు ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రశాంతవాతావరణంలో నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించడానికి భారీ స్థాయిలో పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, ప్రలోభాలకు గురిచేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.4.77 కోట్ల విలువైన వస్తువులు, మద్యం, ఆభరణాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రసంగాల అనువాదకుడు రోశయ్య

● తెలుగు అనువాదంతో పెద్దల ప్రశంసలు.. ప్రజల అభినందనలు

1968లో వేమూరులో జరిగిన ఇందిరాగాంధీ ప్రసంగానికి తెలుగు అనువాదం చేస్తున్న రోశయ్య





1983లో బహిరంగ సభలో అనువాదానికి ముందుగా రాజీవ్‌గాంధీతో చర్చిస్తున్న రోశయ్య



మదర్‌థెరిసా ప్రసంగానికి తెలుగు అనువాదం చేసిన అనంతరం ఆమె అభినందనలు పొందుతున్న రోశయ్య

వేమూరు, ఏప్రిల్ 29: రాజకీయ రంగంలో చతురత కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందిన వేమూరు వాసి మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య జాతీయ నాయకుల ప్రసంగాలకు అనువాదకుడిగా పేరుపొందారు. నాయకుల ప్రశంసలతో పాటు ప్రజల అభినందనలు కూడా పొందారు. స్వర్గీయ ప్రధాని ఇందిరా గాంధీ 1968లో వేమూరు గ్రామానికి విచ్చేసి ప్రసంగిస్తున్న సమయంలో హిందీలో ఆమె చేసిన ప్రసంగానికి రోశయ్య తెలుగులో అనువాదం చేశారు. అలాగే మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ 1983నుండి 1985వరకు బహిరంగ సభలో ప్రసంగించిన హిందీ ప్రసంగానికి రోశయ్యే తెలుగు అనువాదం చేశారు. 1989, 1994 మధ్య కాలంలో నాటి కేంద్ర ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బహిరంగ సభల్లో ప్రసంగిస్తున్న తరుణంలో కూడా రోశయ్య తెలుగు అనువాదం చేశారు. అత్యవసరంగా సోనియా గాంధీ ప్రసంగాల్లో కూడా కొణిజేటి తనదైన శైలిలో తెలుగులో అనువాదం చేశారు. నిర్మల హృదయ మదర్‌థెరిసా హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రసంగానికి కూడా రోశయ్యే తెలుగు అనువాదం చేసి ప్రజల మన్ననలను హర్షధ్వానాలతో అందుకున్నారు.

'నందిగం'తో ప్రాణహాని... రక్షణ కల్పించండి

● సీఈవోకు కట్టా ఆనంద్‌బాబు ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బాపట్ల పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి నందిగం సురేశ్ నుంచి తనకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని బాపట్ల పార్లమెంట్ స్వతంత్ర్య అభ్యర్థి కట్టా ఆనంద్‌బాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను అమరావతి సచివాలయంలో ఆయన కలిశారు. నందిగం సురేశ్ అక్రమాలు, దౌర్జన్యాలను సోషల్ మీడియా వేదికగా ఎండగడుతున్న తనపై కక్ష కట్టి, బెదిరిస్తున్నారని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. 'నువ్వొక వలంటీర్‌వి. నా మీదే తిరుగుబాటు చేసే ధైర్యం నీకెవడిచ్చాడు? నామినేషన్ ఉపసంహరించుకోకపోతే మే 13లోపు నిన్ను చంపేస్తా. వచ్చే ఏడాది నా పేరు మీద సినిమా తీస్తా' అని సురేశ్, అతని అనుచరులు బెదిరిస్తున్నారని వివరించారు. ఒంటరిగా ప్రచారం చేస్తున్న తనను, అతని అనుచరులు అనుసరిస్తున్నారని, తనను చంపేస్తారేమోనని భయం వ్యక్తం చేశారు.

చందా ఇవ్వాల్సిందే.. తప్పదు

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ది గుంటూరు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ వైసీపీకి అంటకాగుతున్నది. ఇప్పటికే అసోసి యేషన్‌కు చెందిన కొంతమంది నేతలు వైసీపీ ఎంపీ/ఎమ్మెల్యే అభ్యర్థుల తరపున వకాల్తా పుచ్చుకుని కమీషన్, ఎక్స్‌పోర్టు వ్యాపారుల వద్ద చందాలు వసూలు చేయడం ప్రారంభించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సోమవారం జరిగిన వర్తకుల సమావేశంలోనూ చం దాల వసూళ్ల అంశంపై చర్చించుకున్నట్లు తెలిసింది. ముసుగులు తొలగించి మంగళవారం ఉదయం అం కిరెడ్డిపాలెం బైపాసురోడ్డుకు సమీపంలోని వీఆర్‌కే గార్డెన్స్‌లో వైసీపీ ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, పశ్చిమ, తూర్పు, ప్రత్తిపాడు అభ్యర్థులు విడదల రజిని, నూరి ఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్‌తో ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశా నికి కమీషన్ వ్యాపారస్థులందరూ హాజరు కావా ల్సిందిగా సోమవారం వాట్సాప్ గ్రూపులలో సందేశా లను పంపించు కున్నారు. వైసీపీ అభ్యర్థులకు చం దాలు ఇవ్వడం చాలామంది వ్యాపారులకు ఇష్టం లేదు. ఇదే విషయాన్ని కొంతమంది బహిరంగంగానే అసోసియేషన్ నేతలకు స్పష్టం చేశారు. అయిన ప్పటికీ వారు చందా ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఒక్కో కమీషన్ వ్యాపారి వద్ద రూ.లక్ష వరకు వసూలుచేయాలని నిర్ణయిం చుకున్నట్లు సమాచారం. సుమారుగా రూ.3 కోట్ల మేరకు చందాలు వసూలు చేసి వైసీపీ నేతల చేతుల్లో పెట్టి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు పరోక్షంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ విష యంలో తనదైన 'మార్కు'ని ఓ వ్యాపారి ప్రద ర్శిస్తున్నారు.

ప్రజలను బానిసలుగా చూస్తున్న జగన్

- టీడీపీ, జనసేన నాయకుల
  ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి

ఇంకొల్లు, ఏప్రిల్ 29 : ఓటు వేసిన ప్రజలను బానిసలుగా చూస్తున్న వ్యక్తి జగన్‌రెడ్డి అని, ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చని వైసీపీని ఓటుతోనే బుద్ధి చెప్పాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం మండలంలోని హనుమోజీపాలెంలో టీడీపీ, జనసేన పార్టీ నాయ కులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వ ర్గాల ప్రజలను జగన్‌రెడ్డి నిలువునా మోసం చేశార న్నారు. భిన్న సిద్ధాంతాలు కలిగిన టీడీపీ, జనసేన, టీడీపీ ఒక్కటవడానికి కారణం దుర్మార్గ వైసీపీ పాలన అంతానికేనని అన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి లేక పోగా, పదేళ్లు వెనుకబడ్డామన్నారు. ఇసుక నుంచి మద్యం వరకు యథేచ్ఛగా దోచుకున్నారన్నారు.

చేసేది, చెప్పేది లేక అబద్ధాల మాటలో ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి, ఒక్క నీటి ప్రాజెక్టును కూడా నిర్మించలేని, కనీసం రోడ్లు కూడా మరమ్మతులు చేయలేని అసమర్థ పాలకుడు జగన్‌రెడ్డి అని అన్నారు. ఐదేళ్లు రాష్ట్ర ప్రజలతో ఆటలాడుకున్న జగన్‌రెడ్డిని ఓటుతోనే సత్తాను చాటాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు. పోలవరం లాంటి పెద్ద ప్రాజెక్టును ఆపేసిన పాపం జగన్‌కు తగులుతుందన్నారు. సాగు, తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులను పట్టించుకోని ఏకైన వ్యక్తి జగన్ అన్నారు. అధికారం కోసం, సొంత ఖజానాలు నింపుకోవడానికీ, ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు చేసేందుకు మాత్రమే జగన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. కనీసం యువతకు ఉపాధి లేకుండా చేశారని ఏలూరి ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్లు కోల్పోయిన అన్నింటినీ గాడిలో పెట్టే వ్యక్తి చంద్రబాబు ఒక్కరేనన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పెదపూడి విజయకుమార్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అందరం ఐక్యతతో ఏలూరిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం భీమవరంలో పాల్గొన్న ఏలూరికి పూలతో ఘనంగా స్వాగతం పలికారు. రాత్రి కొణికి, దుద్దుకూరు గ్రామాలలో ఏలూరి ప్రచారం నిర్వహించారు. కొణికిలో భారీగా బైకు ర్యాలీ నిర్వహించారు. పెద్దఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు, ఏలూరి అభిమా నులు మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, పిల్లల బంగారు భవిష్యత్ కోసం టీడీపీ కూటమిని గెలిపించాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరి

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

చినగంజాం : మండలంలోని చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల, ప్రభుదేవా కాలనీలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోపిరాల గ్రామానికి చెందిన చినగంజాం తోటవారి ధర్మసత్రం చైర్మన్ తుమ్మల పెంట శ్రీనివాసరావు, ప్రభుదేవా కాలనీలో వైసీపీ చెందిన 15 ఎస్టీ కుటుంబాల వారు మార్టూరు మం డ లం ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో సోమవారం టీడీపీలో చేరారు. వీరికి ఏ లూరి కండవాలు వేసి ఆహ్వానించారు. కూటమి నాయకులతో కలిసి విజయానికి కృషి చేయాలని శ్రీనివాసరావు భార్య లక్ష్మీప్రసన్నకు ఏలూరి సూచించారు.


కారంచేడులో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి శ్రేణులు

కారంచేడులో ప్రచారం

కారంచేడు(పర్చూరు) : అభివృద్ధి ప్రదాత టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలుపు కోసం కారంచేడులో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజా కూటమి నేతృత్వంలో రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రచార కార్యక్రమం చేపట్టారు. సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడు తూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, రాష్ట్ర భవిష్యత్‌లోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. యువత భవిష్యత్‌కోసం ప్రజా కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా కూటమి శ్రేణులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన చినగంజాం వైసీపీ నాయకులు

రైతులకు సబ్సిడీపై పరికరాలు



కూకట్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కమల్‌కిషోర్... అద్దంకిలోని 4వ వార్డులో ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్

ఇంటింటి ప్రచారంలో బాబీ

బల్లికురవ, ఏప్రిల్ 29 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగినే గతంలో మాదిరిగానే రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ పరికరాలను రాయితీపై అందజేస్తామని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) తెలిపారు. మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో సోమవారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా బాబీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే అద్భుతమైన పథకాలతో పేదల ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఈసారి రైతులు, మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఏడాదికి పెట్టుబడి సాయంగా రూ.20వేలను అందజేస్తున్నట్లు చెప్పారు. దళిత రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. నల్ల చెరకు పంటను ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామన్నారు. అభివృద్ధి పనులు చేపట్టే సత్తా ఉన్న టీడీపీ అభ్యర్థి గొట్టిపాటికి, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఇప్పల అంజిరెడ్డి, పందిరి అబ్రహం, ముంద్రు దానయ్య, రమేష్, రాఘవ పాల్గొన్నారు.

యువత భవిష్యత్‌ను నాశనం చేసిన జగన్

అద్దంకి : వైసీపీ పాలనలో యువత బంగారు భవిష్యత్‌ను జగన్ నాశనం చేశారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ అన్నారు. నాన్నను గెలిపించాలని కోరుతూ పట్టణంలోని 4వ వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి నిరుద్యోగులను నిలువునా ముంచేశారన్నారు. జగన్‌రెడ్డి చేతగాని పాలనతో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో 4 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. అలాగే నిరుద్యోగులకు ఎప్పటిలాగే నిరుద్యోగ భృతిని రూ.3వేలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ, గోపి, కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, ధూళిపాళ్ల రామచంద్ర ప్రసాద్, లహరి, కిరణ్, చిరుమామిళ్ల మాధవరావు, వీరాంజనేయులు, మాలిక్ పాల్గొన్నారు.

వైసీపీకి గుడ్‌బై చెప్పిన ముక్తేశ్వరం, వైదన యువకులు

ఎమ్మెల్యే గొట్టిపాటి సమక్షంలో టీడీపీలోకి చేరిక

బల్లికురవ, ఏప్రిల్ 29 : ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో మండలంలోని వైదన, ముక్తేశ్వరం గ్రామాలలో వైసీపీకి షాక్ తగిలింది. రెండు గ్రామాలకు చెందిన యువకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. ముక్తేశ్వరం గ్రామానికి చెన్నూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో శంకర్‌శెట్టి వెంకటకోటేశ్వరరావు, చెన్నూరి నాగార్జున, గుంటుపల్లి గోపి, జాగర్లమూడి హరీష్, నాగళ్ల మణికంఠ, బాలకృష్ణ, శేషుబాబు, పసుపులేటి మదుబాబు, గుంటుపల్లి అంకమ్మరావు, షేక్ నాగుర్‌వలి, కరీం బాషా, మాసాని అంజి పార్టీలో చేరారు. వైదన గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు మెంబరు షేక్ గోపి, పావులూరి వీరాంజి, శివయ్య, బొజ్జా కోటయ్య, గంపాచిన అక్కయ్య, పొదిలి రాముడు, బండారు మల్లికార్జున, 40 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో అగ్రామ టీడీపీ నేతలు పోగుల చంద్రశేఖర్, జనసేన నేతలు పాల్గొన్నారు.


గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన ముక్తేశ్వరం యువకులు

1వ తేదీనే పెన్షన్ పంపిణీ

చినగంజాం, ఏప్రిల్ 29 : మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో సామాజిక పెన్షన్ లబ్ధిదారులకు మే 1వ తేదీనే నగదు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో యూబీ వరప్రసాద్ సోమవారం తెలిపారు. మండల పరిధిలో గల 6066 పెన్షన్‌లకు గాను 1596 మంది పెన్షన్‌దారులకు ఇంటి వద్దనే గ్రామ సచివాలయ సిబ్బంది అందజేస్తారని తెలిపారు. మిగిలిన 4370 మంది పెన్షన్ లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాలకు మే 1వ తేదీన జమ చేయనున్నట్లు తెలిపారు. ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేసేవారి జాబితా సచివాలయ గ్రా కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌ల వద్ద ఉన్నట్లు తెలిపారు. దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మంచంపై ఉన్న వారికి ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది పెన్షన్ అందజేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

11 మంది వలంటీర్ల రాజీనామా

మార్టూరు, ఏప్రిల్ 29 : మార్టూరు గ్రామంలోని రెండవ, మూడవ గ్రామ సచివాలయాల పరిధిలో పని చేస్తున్న 11 మంది గ్రామ వలంటీర్లు సోమవా రం తమ రాజీనామాలను ఎంపీడీవో కార్యాలయంలో అందచేశారు.

ఒక పక్క ఉపాధి పనులు.. మరోవైపు యంత్రాలతో మట్టి తవ్వకాలు

- కలవకూరు చెరువులో రియల్ వ్యాపారుల బరితెగింపు
- యథేచ్ఛగా గ్రావెల్ తోడకం
- గ్రామస్థుల ఫిర్యాదుతో నిలిపివేసిన అధికారులు

అద్దంకి, ఏప్రిల్ 29 : రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరి తెగించి చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టి వెంచర్‌లకు తరలిస్తున్నారు. మండలంలోని కలవకూరు చెరువు నుంచి గత రెండు రోజులుగా సమీపంలో ఉన్న వెంచర్‌లకు టిప్పర్‌లతో గ్రావెల్ తరలిస్తున్నారు. ఎక్కువ లోతు గుంతలు చేసి గ్రావెల్ తవ్వకాలు చేయడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కూడా చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనాలకు వెళ్లిన విద్యార్థి మునిగి మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు మట్టిని యథేచ్ఛగా తరలించటం పట్ల గ్రామస్థులు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మట్టి తరలింపును నిలిపేశారు.


కలవకూరు చెరువులో ఉపాధి పనులు చేస్తుండగా, మరో వైపు టిప్పర్‌కు మట్టిని ఎత్తుతున్న ఎక్స్‌కవేటర్

ఉపాధి హామీ పనులు జరిగేచోట యంత్రాలతో

కలవకూరు చెరువులో ఉపాధి హామీ ద్వారా పనులు జరుగుతున్నాయి. కూలీలు చెరువు పనులు చేస్తున్నారు. అయితే సమీపంలోనే కొందరు యంత్రాలతో గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. దీంతో ఉపాధికూలీలు చేసిన పనులు కూడా యంత్రాలతో జరిగాయా అన్న అనుమానాలు ఉన్నతాధికారులు వ్యక్తం చేసే అవకాశం ఉంటుందన్న ఆందోళన కూలీలలో నెలకొంది. అదే సమయంలో యంత్రాలతో చేసిన పనిని కూడా క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికార పార్టీ నేతలు కుమ్మక్కై లబ్ధి పొందే అవకాశం కూడా లేకపోలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెరువుకు నీరు వచ్చిన వెంటనే పనులు కూడా కనిపించే అవకాశం ఉండదు కాబట్టి లబ్ధి పొందే అవకాశం కూడా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులో మట్టి తవ్వకాలు చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న టీడీపీ నేతలు

బాధిత కుటుంబానికి టీడీపీ సాయం

చినగంజాం, ఏప్రిల్ 29 : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుదేవా కాలనీలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి టీడీపీ మండల నేతలు సోమవారం సాయం అందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, మండల నాయకులు కట్టా తిరుపతమ్మ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం, నిత్యవసర సరుకులు, చాప, దుప్పట్లు తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాం అజాద్, టీ.జయరావు, రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, సందు శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, నరహరి శ్రీనివాసరావు, గంటా చెన్నయ్య ఎం.రామాంజనేయులు, షేక్ జిలాని, పి.సార్థసారిధి, కే.విష్ణు, బయ్యా సతీష్, ఎం.లక్ష్మయ్య, జి.నరసింహారావు, టి.చిన్నా, జి.వెంకటనారాయణ, పీ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనుమానితుల వివరాలు అందించండి

చీరాలటౌన్, ఏప్రిల్ 29 : అపరిచితులు మీ ప్రాంతాలలో సంచరిస్తున్న లేక అనుమానస్పద పరిస్థితులు మీ పరిసరాల్లో కనింపించిన సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని టూటౌన్ సీఐ సోమశేఖర్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం స్టేషన్ పరిధిలోని కొత్తపేట, ప్రసాద్‌నగర్, వివేకానంద నగర్, ఆర్టీసీ కాలనీ, లక్ష్మీ శ్రీనివాస కాలనీ, ఐఎల్‌టీడీ కాలనీలలో రూట్ మార్చ్ నిర్వహించారు. అలాగే ఆయా ప్రాంతాలలోని పాత నేరస్తులకు ప్రత్యేకమైన కౌన్సెలింగ్ చేసి వాహనాలు తనిఖీలు చేశారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి అన్ని విధాలుగా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలకు ఏదయినా సమస్యలు తలెత్తితే సమాచారాన్ని నేరుగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

54 మద్యం సీసాలు పట్టివేత

మార్టూరు, ఏప్రిల్ 29 : కొణిదెన రోడ్‌లో సోమవారం అక్రమంగా మద్యం అమ్ముతున్న కొప్పరం బాలకృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి 54 మద్యం క్వార్టరు సీసాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతనిని మద్యం సీసాలతో స్టేషన్‌కు తరలించారు.

మేదరమెట్లలో మద్యం బాటిళ్లు స్వాధీనం

మేదరమెట్ల, ఏప్రిల్ 29 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎస్ఈబీ అధికారులు మేదరమెట్లలో నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తి వద్ద ఏడు మద్యం సీసాలను పట్టుకున్నారు. సోమవారం రాత్రి మేదరమెట్లకు చెందిన ఐనమిల్లి శ్రీనివాసరావు వద్ద రెండు తెలంగాణ మద్యం సీసాలు మిగిలిన ఐదు మద్యం సీసాలు ఏపీకి చెందినవి ఉన్నాయి. ఏడు ఫుల్‌బాటిళ్లు దొరికినట్లు ఎస్ఈబీ ఎస్సై వి.సైమన్ తెలిపారు.

అమ్మ ఆశ్రమ అధ్యక్షునికి నంది పురస్కారం

మార్టూరు, ఏప్రిల్ 29 : కొణిదెన రోడ్‌లో ఉన్న అమ్మ ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు హైదరాబాద్‌లో వల్లూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంగారు నందితో పురస్కారాన్ని అందచేశారు. ఆదివారం రాత్రి హైదరాబాదులో రవీంద్ర భారతిలో జరిగిన ఉగాది వేడుకలలో అమ్మ ఆశ్రమం ద్వారా పేదలకు, వృద్ధులకు అన్నదానం చేస్తున్న చందు సేవలను గుర్తించి బంగారు నందిని అందచేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక పండితులు దైవజ్ఞ శర్మ, చిక్కడ పల్లి సీఐ సీతయ్య సినీ నటి స్నేహా చౌదరి, నటుడు మాణిక్, ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


హైదరాబాద్‌లో చందుకు బంగారు నందితో సన్మానిస్తున్న వల్లూరి ఫౌండేషన్ సభ్యులు


ఆరికట్లవారిపాలెం ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న దళిత నేతలు

దళిత ద్రోహి జగన్‌రెడ్డి

- పథకాల రద్దుతో దూరమైన విద్య
- చిత్తుగా ఓడించాలని ఎస్సీ నేతల పిలుపు

పంగులూరు, ఏప్రిల్ 29 : వైసీపీ ఐదేళ్ల పాలనలో దళిత విద్యార్థుల విద్యావకాశాలను దూరంచేసిన ద్రోహి జగన్‌రెడ్డి అని టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు అన్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం, జనకవరం గ్రామాలలో ఎస్సీ సెల్ ప్రతినిధులు టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని సోమవారం ఎస్సీకాలనీలో ప్రచారం నిర్వహించారు. కాలనీలో 1, 2 తరగతులను అంగన్‌వాడీలతో విలీనం చేసి ప్రాథమిక పాఠశాలలను రద్దు చేశారన్నారు. జీవో 107ని విడుదల చేసి ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో కన్వీనర్ కోటా తీసుకురావడం ద్వారా ఎస్సీలకు రిజర్వేషన్ లేకుండా చేసిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. దీంతో 1088 మెడికల్ సీట్లను దళిత విద్యార్థులు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 707తో ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ కళాశాలల్లో ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంసీఏ, ఎంబీఏ కోర్సులకు రీయింబర్స్‌మెంట్‌ను రద్దు చేశారని ధ్వజమెత్తారు. అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను మూసివేసి విద్యకు దూరం చేసిన జగన్‌రెడ్డిని ఎస్సీలంతా చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మందా ఆమోస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఉన్నం రవిబాబు, అమర్తపూడి చిన్న, తెలగతోటి రాధాకృష్ణమూర్తి, కొలకలూరి వెంకటరావు, దయాశేఖర్, కొమ్ము పేతురు, ధనరాజుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాబు సభను జయప్రదం చేయాలి

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య

చీరాల, ఏప్రిల్ 29 : టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య విజ్ఞప్తి చేశారు. 216 జాతీయ రహదారి పక్కనున్న టీడీపీ కార్యాలయం పక్కనున్న ఖాళీ స్థలంలో చంద్రబాబు సభకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, బాపట్ల పార్లమెంట్ నియోజకర్గ పరిధిలోని మిగిలిన ఆరు నియోజవకర్గాల బాధ్యులు, శ్రేణులతో సభ జయప్రదంకు సహకరించాలని కొండ య్య కోరారు. పార్టీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, పక్కన బహిరంగ సభ వేదిక, ఇతర ఏర్పాట్లకు సంబంధించి సోమవారం కొండయ్య, టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, బాపట్ల పార్లమెంట్ నియోజకర్గ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబుతో కలసి వేదపండితుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బుధవారం చీరాలలో జరిగే చంద్రబాబు సభను జయప్రదం చేసేందుకు కూటమి శ్రేణులు విస్తృతంగా సంయమనంతో జయప్రదం చేసేందుకు కదం తొక్కాలన్నారు. రాష్ట్రంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమలుతో అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. జనం ఆస్తిపై జగన్ కన్ను పడిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జగన్ అనే కంఠకుడి నుంచి రాష్ట్ర విముక్తికి కార్యోన్ముఖులవుతున్నారన్నారు. భావసారూప్యం ఉన్న ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకుపోతూ జగన్ అండ్ కోను సాగనంపే క్రమంలో శ్రేణుల్లో నూతనోత్సాహం నింపేందుకు, దిశానిర్దేశం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు వస్తున్నారన్నారు. చంద్రబాబు సభను జయప్రదం చేయటం ద్వారా కూటమి శ్రేణుల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు చంద్రబాబు సభా స్థలానికి చేరుకుంటారన్నారు. ప్రతి కార్యకర్త క్రమ శిక్షణగల సైనికునిగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసే, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య తదితరులు

గెలుపు మనదే.. అయినా నిర్లక్ష్యం వద్దు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 29 : చీరాల నియోజకవర్గంలో గెలుపు టీడీపీ కూటమిదేనని, అయినా నిర్లక్ష్యం వహించకుండా ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య విజయం కోసం అందరూ శ్రమించాలని కొండయ్య కుమారుడు గౌరీఅమర్‌నాథ్ కోరారు. మండలంలోని రామన్నపేట పంచాయతీ రావూరిపేటలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో కలసి గౌరీ అమర్‌నాథ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. వచ్చేది టీడీపీ కూటమి ప్రభుత్వమని, అన్ని సమస్యలను పరిష్కరించడంతోపాటు అర్హులందరికీ పథకాలను అందిస్తామన్నారు. అందరి బాగుకోసం కూటమి ఎమ్మెల్యేగా కొండయ్యను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. బుధవారం చంద్రబాబు సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పొగడదండ రవికుమార్, నాసిక వీరభద్రయ్య, కోటయ్య, వెంకటేశ్వర్లు, కర్త శ్రీనివాస్, గుత్తి కుమార్, శ్రీనివాసరావు, అయ్యప్ప, సుబ్రమణ్యం, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న గౌరీఅమర్‌నాథ్

ఓటర్ స్లిప్‌ల పంపిణీపై బీఎల్వోలకు సూచన

మార్టూరు, ఏప్రిల్ 29 : మే 13న జరిగే పోలింగ్ రోజు ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్లకు ఓటర్ స్లిప్పుల పంపిణీపై బీఎల్వోలకు ఏఈఆర్వో సంధ్యశ్రీ పలు సూచనలు చేశారు. సోమవారం మార్టూరులో మండలంలోని 72 మంది బీఎల్వోలతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వారికి స్లిప్‌ల పంపిణీపై పలు సూచనలను, మార్గదర్శకాలను ఏఈఆర్వో అందించారు.